PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక : 108 పేజీలు : 8 శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 వెల : 4/-






## సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

- ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు
- వేగంగా పెరుగుతున్న మౌలిక వసతులతో లాజిస్టిక్స్, తయారీ రంగాలకు కొత్త బలంగా మారింది
- భారత్‌లో తయారవుతున్న చిప్‌లు దేశంతో పాటు ప్రపంచ మార్కెట్లకు చేరుతున్నాయి



## దేశ అభివృద్ధి అజెండాలో జాతీయ భద్రత చాలా కీలకం

- ఉగ్రవాదం విషయంలో భారత్ ఇక కేవలం ఖండనలకే పరిమితం కాదు- దీటుగా బదులిస్తోంది
- దేశ భద్రత, సరిహద్దు సవాళ్ల విషయంలో కీలక వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించి ఇకపై భారత్ కేవలం దౌత్యపరమైన ఖండనలకే పరిమితం కాదని వెల్లడి
- దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీ నాయకత్వం నిజంగా చరిత్రాత్మకం

# పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణ

- ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం
- అమరుల త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించుకున్నాం
- ఆ చరిత్ర, ఉద్యమాల ఫలాలు ప్రజల్లో కనిపించాలి
- రైతుకు భరోసా ఉండాలి.. మహిళలు ఆర్థికంగా ఎదగాలి
- పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి
- యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి
- నిజాం పాలనలో పలు రంగాల్లో హైదరాబాద్ పురోగతి
- ప్రజా పాలన దినోత్సవాల్లో ముఖ్యమంత్రి ప్రసంగం





హైదరాబాద్

అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజా పాలనకు పునాదులని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'సెప్టెంబర్ 17 మనకు గతాన్ని మాత్రమే గుర్తు చేసే రోజు కాదు. మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక ఘట్టం. సకల జనుల ఉద్యమం, ఎన్నో పోరాటాలు, అమరుల త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఇప్పుడు ఆ చరిత్ర, ఆ ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. అభివృద్ధి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ చేరాలి. చరిత్రను మరిచిపోం. చరిత్ర దగ్గరే ఆగిపోం. ఆ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో... తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం'అని అన్నారు. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన ప్రజా పాలన దినోత్సవాల్లో ముఖ్యమంత్రి మువ్వన్నెల జెండా ఎగురవేశారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులందరికీ ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార - మిగతా3లో

## 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నాం

- అమెరికా ఆంక్షల బిల్లు ఆమోదంపై భారత్
- రష్యాపై ఆంక్షల బిల్లుకు ఆమోదంపై స్పందించిన భారత్
- ఆ బిల్లు గురించి తమకు అవగాహన ఉందన్న కేంద్ర విదేశాంగ శాఖ




# నాటి అసంఖ్యాక సవాళ్లకు హైదరాబాద్ చరిత్ర ప్రతిబింబం

- ఇదో రాజనీతిజ్ఞత, ధైర్యం, త్యాగాల గాథ
- దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఓ కీలక ఘట్టానికి ముగింపు
- ప్రజా ఉద్యమంలో విద్యార్థులు, మేధావులు, సామాన్య పౌరుల భాగస్వామ్యం
- జాతీయ సమగ్రతకు బాటలు వేయాల్సిన ఆవశ్యకతను ఈ ఘట్టం గుర్తుచేస్తుంది
- హైదరాబాద్ విమోచన దినోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్




హైదరాబాద్

విభిన్న రాజకీయ పరిస్థితుల నడుమ ఎన్నో సంఘర్షణలకు గురైన ప్రజలను ఏకతాటి పైకి తేవడంలో ఒక నవ స్వతంత్ర దేశం ఎదుర్కొన్న అసంఖ్యాక సవాళ్లను హైదరాబాద్ చరిత్ర ప్రతిబింబిస్తుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చెప్పారు. ఈ పరిణామాలను రాజనీతిజ్ఞత, ధైర్యం, త్యాగాల గాథగా ఆయన అభివర్ణించారు. ప్రతి పౌరుడికీ సమాన స్థాయినిచ్చే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య సౌధం నిర్మించే దిశగా నిరంతర, బృహత్తర ప్రక్రియ కొనసాగిందని అన్నారు. హైదరాబాద్ విమోచన నేపథ్యంలో సాగిన ప్రజా ఉద్యమాన్ని ఆయన కొనియాడారు. ఆనాడు విద్యార్థులు, మేధావులు, - మిగతా3లో

## అటు కరవు, ఇటు వరదలు



- ఇంకిపోతున్న భూగర్భజలాలు
- ప్రపంచానికి నీటి గండం: డబ్ల్యూఎంఓ హెచ్చరిక
- భూమిపైన అన్ని ప్రధాన గ్లేసియర్స్ వేగంగా మంచును కోల్పోతున్నాయి
- ఐక్యరాజ్యసమితి డబ్ల్యూఎంఓ ఆందోళన
- కూడా అడుగంటిపోతున్నాయని స్పష్టం
- ఆసియా, ఆఫ్రికాల్లోనే పెను విపత్తులు సంభవిస్తున్నాయని హెచ్చరిక!

# డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా



**పట్టభద్రుల ఎన్నికల కోసం గతంలో ఓటున్న వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి**

- గ్రాడ్యుయేట్స్ ఓట్ల నమోదు కోసం ఈనెల 20న ఈసీ పబ్లిక్ నోటీసు
- నవంబర్ 6 వరకు పట్టభద్రుల ఓటరు దరఖాస్తుల స్వీకరణ
- గత జాబితాలో ఓటున్న పట్టభద్రులు కూడా మళ్లీ కొత్తగా ఫారం 8 సమర్పించాల్సిందే

హైదరాబాద్

రాష్ట్రంలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు ఈసీ కసరత్తు చేపట్టింది. మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూలు ప్రకటించింది. ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవీకాలం మార్చితో ముగియనుండటంతో ఆ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు కొత్తగా ఓటర్ల జాబితా తయారు చేయనున్నారు. ఈనెల 28న పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటు నమోదు కోసం పట్టభద్రుల నుంచి ఫారం 8 దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబరు 25న రెండు నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. డిసెంబరు 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను ఈసీ ప్రకటించనుంది. గత జాబితాలో ఓటున్న పట్టభద్రులు కూడా మళ్లీ కొత్తగా ఫారం 8 సమర్పించాల్సిందేనని ఎన్నికల కమిషన్ స్పష్టం - మిగతా3లో

# మంత్రి పదవి కంటే పీసీసీ పదవే పెద్దది

- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- తనను ఎవరూ మంత్రి పదవి తీసుకోమని ఎవరూ అడగలేదు
- 'వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా నలుగురిని నియమిస్తాం
- ఎస్సీ ,ఎస్టీ ,మైనార్టీ, జనరల్ కేటగిరీలకే ప్రాధాన్యత
- తెలంగాణ ఇంచార్జ్ ఎవరినేది అధిష్టానం నిర్ణయం



# అటు కరవు, ఇటు వరదలు



ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల కారణంగా భూమిపై నీటి వ్యవస్థ (వాటర్ సైకిల్) తీవ్ర అస్తవ్యస్తంగా, అత్యంత ప్రమాదకరంగా మారుతోందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) గురువారం హెచ్చరించింది. గ్లేసియర్లు (హిమానీనదాలు) వేగంగా కరిగిపోతుండటం, మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో ఒకచోట భారీ వరదలు, మరోచోట కరవులు సంభవిస్తున్నాయని పేర్కొంది. రానున్న భయంకరమైన ఎల్‌నినో ప్రభావం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయనుందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా భవిష్యత్తులో ప్రజల జీవనోపాధి, ఆరోగ్యం, ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రిపోర్టులో పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచం ముందు భారీ నీటి సంక్షోభం ముప్పు పొంచి ఉందని, ఇదంతా మానవాళి మనుగడకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయని హెచ్చరించింది. ఐదేళ్ల పాటు పరిశోధన చేసిన 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ వాటర్ రిసోర్సెస్' రిపోర్టులో డబ్ల్యూఎంఓ ఈ కీలక విషయాలు వెల్లడించింది.

**ఆసియా, ఆఫ్రికాపైనే అత్యధిక ప్రభావం**

గత ఐదేళ్లలో సంభవించిన నీటి సంబంధిత విపత్తుల్లో (వరదలు, కరవులు) సగానికిపైగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే ఉన్నాయని డబ్ల్యూఎంఓ స్పష్టం చేసింది. ఈ రిపోర్ట్ ప్రకారం, నీటి విపత్తుల వల్ల సంభవించిన మరణాల్లో 80 శాతానికిపైగా ఈ రెండు ఖండాల్లోనే నమోదవడం గమనార్హం. కొన్ని చోట్ల ఒక విపత్తు నుంచి కోలుకోక ముందే మరో తీవ్ర ఘటన సంభవించిందని పేర్కొంది. డబ్ల్యూఎంఓ నివేదిక ప్రకారం, భూమిపై ఉన్నటువంటి అన్ని ప్రధాన గ్లేసియర్ ప్రాంతాలు మంచును కోల్పోతుండటం ఇది వరుసగా నాలుగో ఏడాది. 2023–25 మధ్య కాలంలో చూస్తే గ్లేసియర్లు ఏకంగా 1400 గిగాటన్నుల మంచును కోల్పోయాయి. ఈ నీరు ఎంత ఎక్కువ అంటే దీనితో సుమారు 56 కోట్ల ఒలింపిక్ పరిమాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్స్‌ను నింపొచ్చు. ఇంకా సమస్త మానవాళి ఏడాది పొడవునా ఉపయోగించే మంచినీటిలో సుమారు మూడోవంతుకు సమానం. 2025లో ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండింతల బావుల్లో భూగర్భ జలాలు చారిత్రక సగటు కంటే కూడా దారుణంగా పడిపోయాయి. భూమిపై నీటి నిల్వల్లో భూగర్భ జలాల పాత్ర కీలకం. కానీ భారత్, ఐరోపా, అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలోని పలు ప్రాంతాల్లో ఈ భూగర్భ జలాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2022–25 మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో తరచుగా భూగర్భ జలాల లోటు నమోదైంది.

ఇంకా 2025 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా నదుల్లో నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిపోయింది. అంటే నదుల్లో నీటి మట్టాలు కూడా వేగంగా పడిపోతున్నాయని, గత 35 ఏళ్లలో చూస్తే అత్యల్ప నీటి ప్రవాహం నమోదైన సంవత్సరాల్లో ఇదొకటిగా నిలిచిందని ఔమీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అమెజాన్, జాంబేజీ, నైలు వంటి ప్రధాన నదీ పరివాహక ప్రాంతాల్లోనూ నీటి ప్రవాహాలు పెద్ద మొత్తంలో పడిపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

**ప్రపంచ దేశాలు సహకరించుకుంటేనే సమస్యకు పరిష్కారం!**

డబ్ల్యూఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్టే సౌలో మాట్లాడుతూ, 'గ్లేసియర్లు, భూగర్భ జలాలు భూమికి ఒక బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ వంటివి. ఇవి కరవు కాలంలో భూమిని కాపాడే రక్షణ కవచంగా (బఫర్) పనిచేస్తాయి. సాధారణంగా దశాబ్దాల వరకు ఇవి నీటిని నిల్వ చేసుకుంటాయి. కానీ ఇటీవల పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. మనం ఆ సేవింగ్స్ ఖాతాను నిరంతరం వాడేస్తూ ఖాళీ చేస్తున్నాం. 2014–16 నుంచి ప్రపంచవ్యాప్తంగా నీటి నిల్వలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. వరుసగా నాలుగో సంవత్సరం కూడా భూమిపై ఉన్న ప్రతి ప్రధాన హిమానీనద ప్రాంతం తీవ్రంగా మంచును కోల్పోయింది. ప్రపంచవ్యాప్తంగా 2025లో మూడింట రెండొంతుల బావుల్లో భూగర్భ జలాలు సాధారణం కంటే దిగువ స్థాయికి పడిపోయాయి' అని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎల్ నినో రానున్న రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో వరదల్ని, మరికొన్ని ప్రాంతాల్లో కరవుల్ని తెచ్చిపెట్టే ప్రమాదం ఉందని సౌలో హెచ్చరించారు. ఇదే సమయంలో నీటికి సరిహద్దులేం ఉండవని, ఒక దేశంలో నదీ పరివాహక ప్రాంతంలో జరిగే మార్పులు, మరో దేశంలోని నీటి లభ్యతను కూడా ప్రభావం చేయగలవని ఆమె స్పష్టం చేశారు. కాబట్టి ప్రపంచ దేశాలన్నీ నీటి డేటాను పరస్పరం పంచుకుంటూ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అప్పుడు మాత్రమే రానున్న ముప్పు నుంచి మానవాళిని కాపాడుకోగలమని చెప్పారు.

# సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్



సెమీకండక్టర్ రంగంలో భారత్ శరవేగంగా ముందుకు వెళ్తోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచ చిప్ తయారీకి కొత్త, నమ్మకమైన కేంద్రాల అవసరం పెరుగుతున్న సమయంలో భారత్ గ్లోబల్ హబ్?గా సిద్ధమవుతోందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని, దీంతో ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఢిల్లీలో గురువారం ప్రారంభమైన సెమీకాన్ ఇండియా 2026 ఐదో ఎడిషన్‌లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు.

**చిప్ తయారీకి భారత్**

సెమీకండక్టర్ తయారీకి ప్రపంచ దేశాలు కొత్త, విశ్వసనీయ ప్రాంతాలను వెతుకుతున్నాయని మోదీ చెప్పారు. భారత్ కూడా చిప్ తయారీకి ప్రాధాన్య కేంద్రంగా ఎదిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. తయారీదారులు విజయవంతం కావడానికి అవసరమైన విధానాలు, నిబంధనలు, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. ఇప్పటికే దేశంలో 12 చిప్ తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని ప్రధాని వెల్లడించారు. రానున్న దశలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. చిప్ డిజైన్, అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాకుండా, చిప్ తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, ముడి పదార్థాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాలను కలిపి పూర్తి సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని వివరించారు.

**మిషన్ 2.0కు భారీగా నిధులు**

భారత్ సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ప్రభుత్వం కేటాయింపులను భారీగా పెంచిందని మోదీ తెలిపారు. మొదటి దశలో 8 బిలియన్ డాలర్లుగా ఉన్న కేటాయింపులను 13.5 బిలియన్ డాలర్లకు పెంచినట్లు చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. దేశంలో సెమీకండక్టర్ రంగం ఎదగడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు కొత్త కంపెనీలు, ఉద్యోగాలు, పరిశోధన అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కొన్ని ప్రాంతాలపై ఉన్న ఆధారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో భారత్‌కు ఇది ఒక పెద్ద అవకాశంగా మారుతుందని చెప్పారు.

**15 రోజుల్లోనే!**

భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో గత 15 రోజుల పరిణామాలను చూస్తే అర్థమవుతుందని మోదీ అన్నారు. సెప్టెంబర్‌లో ముంబయిలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ జరిగిందని గుర్తుచేశారు. అక్కడ ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటం టెక్నాలజీల ద్వారా సమ్మిళిత ఆర్థిక సేవలపై చర్చ జరిగిందన్నారు. అదే సమయంలో దేశంలో సుమారు 3 వేల కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. దీనివల్ల దేశవ్యాప్తంగా సరుకు రవాణా వేగం పెరుగుతుందని, లాజిస్టిక్స్ మరింత మెరుగవుతాయని తెలిపారు. మెరుగైన రవాణా వ్యవస్థ తయారీ రంగానికి మరింత బలాన్ని ఇస్తుందని మోదీ చెప్పారు.

**ఆర్థిక వృద్ధి– ప్రపంచ నమ్మకం**

భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ప్రధాని అన్నారు. అదే సమయంలో ప్రపంచ దేశాలకు భారత్‌పై ఉన్న విశ్వాసం కూడా పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుత సవాళ్ల మధ్య కూడా దేశం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన రేటింగ్ సంస్థ జేసీఆర్ఏ భారత్ రేటింగ్‌ను పెంచిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. భారత్‌లో తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఎదగడానికి సెమీకండక్టర్ రంగం ఉపయోగపడుతుందని మోదీ తెలిపారు.

**విశ్వకర్మ జయంతి– సెమీకాన్‌కు అనుసంధానం**

విశ్వకర్మ జయంతి రోజున సెమీకాన్ ఇండియా కార్యక్రమం జరగడం ప్రత్యేకమని ప్రధాని అన్నారు. సృష్టి, నిర్మాణానికి విశ్వకర్మ ప్రతీకగా భారత సంప్రదాయంలో భావిస్తారని చెప్పారు. ఒకవైపు శతాబ్దాల నాటి నిర్మాణ సంప్రదాయం, మరోవైపు 21వ శతాబ్దపు సాంకేతికత, ఆలోచన ఈ రెండింటి కలయికే ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ లక్ష్యానికి స్ఫూర్తి అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో సెమీకాన్ ఇండియా 2026 జరుగుతోంది. సిలికాన్ టు సిస్టమ్స్: బిల్డింగ్ ద ఎకోసిస్టమ్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ సెమీకండక్టర్ రంగానికి చెందిన కంపెనీలు, నిపుణులు, పెట్టుబడిదారులు ఇందులో పాల్గొంటున్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్- ఇద్దరు ఉగ్రవాదులు హతం

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలపై భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉధంపూర్ జిల్లాలోని మజల్తా ప్రాంతంలోని బ్రెట్టల్ సోహన్, ఖుబ్బన్ అటవీ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే వారికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జీవవీ)తో సంబంధాలున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సెప్టంబర్ 16 (బుధవారం)న బ్రాటెల్ సోన్, ఖుబ్బన్ అటవీప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారని పక్కా సమాచారం అందడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. సుమారు రాత్రి 9 గంటల సమయంలో సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. నిర్దిష్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు ప్రారంభించారు. ఆపరేషన్ మొదలైన కాసేపటికే ఉగ్రవాదుల స్థావరం లక్ష్యంగా భద్రతాబలగాలు కాల్పులు జరిపాయి. పేలుళ్ల శబ్దాలు కూడా అటవీప్రాంతంలో వినిపించాయి. అయితే గురువారం ఉదయం భద్రతా వలయాన్ని తప్పించుకునేందుకు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరంగా కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. అదనపు బలగాలతో అటవీ ప్రాంతాన్ని నలువైపులా దిగ్బంధించినట్లు తెలిపారు.

**కొనసాగుతున్న ఆపరేషన్**

అదనపు బలగాలను ఘటనాస్థలికి తరలించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇద్దరు ఉగ్రవాదులు హతమైనప్పటికీ, ప్రాంతంలో మరెవరైనా దాక్కున్నారా అనే కోణంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఆపరేషన్ పూర్తిగా ముగియలేదని సైన్యం స్పష్టం చేసింది. మిగిలిన ముప్పును గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో మోహరించి ఉన్నాయని వైట్ నైట్ కార్ప్స్ తెలిపింది. హతమైన వారి గుర్తింపు, ఇతర వివరాలపై అధికారికంగా మరింత సమాచారం వెలువడాల్సి ఉంది.

**లష్కరే ఉగ్రవాది హతం**

ఇటీవల దక్షిణ కశ్మీర్‌లోని సైద్‌పొరా ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా (రాజు) ఉగ్రవాదిని భద్రతా బలగాలు హతమార్చాయి. జులై 8న ఐదు రోజుగా దాక్కొని ఉన్న ఎల్?ఈటీ ఉగ్రవాదని ఎన్?కౌంటర్?లో మట్టుబెట్టాయి. షోపియాన్‌లోని సైద్‌పొరా ప్రాంతంలోని దట్టమైన పండ్ల తోటలో ఇద్దరు ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు నిఘా కెమెరాల్లో రికార్డైంది. లష్కరే కమాండర్ జాకీర్ గనాయ్, అతని అనుచరుడు లతీఫ్ భట్ సంచరిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జులై 3న షోపియాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్(ఆర్ఆర్), సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ సెర్చ్ ఆపరేషన్?ను ప్రారంభించాయి. ఆ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి జల్లెడ పట్టాయి. రాత్రి వేళల్లో సైతం ఆపరేషన్ నిరాటంకంగా కొనసాగేలా ఆ ప్రాంతమంతా ప్రత్యేక లైట్లను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే జులై 8 ఉదయం ఉగ్రవాదులు బలగాలకు తారసపడగా కాల్పులు జరిపారుయ. వాటికి ప్రతిగా భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులు జరిపాయి. ఇరువర్గాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఆ తర్వాత ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం సమీపంలో ఉగ్రవాది మృతదేహాన్ని గుర్తించారు. అతడిని జాకిర్ అహ్మద్ గనీగా గుర్తించారు. ఘటనాస్థలికి సమీపంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి గుర్తించినట్లు పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఉగ్రవాది లతీఫ్ కోసం భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా మేలో దేశాన్ని కుదిపేసిన పుల్వామా ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి అర్జుమండ్ గుల్జార్ అలియాస్ బుర్హాన్ హంజా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో హతమైనట్లు తెలిసింది. గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయ పడిన హంజా, రావల్పిండి కంబైన్డ్ మిలిటరీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## దేశ అభివృద్ధి అజెండాలో జాతీయ భద్రత చాలా కీలకం

ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని క్షేత్రస్థాయిలో దృఢంగా అమలు చేయడం దేశంలోనే తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే జరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించి భారత్ కేవలం దౌత్యపరమైన ఖండనలకే పరిమితం కాకుండా నిర్ణయాత్మకమైన, శక్తివంతమైన సమాధానాలను ఇచ్చే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. మోదీ హయాంలోనే దేశంలో నక్సలిజం నిర్మూలించామని గుర్తు చేశారు. ఈశాన్య ప్రాంతంలో దశాబ్దాల నాటి వివాదాలు శాంతి ఒప్పందాల ద్వారా పరిష్కారమయ్యాయని వెల్లడించారు. అలాగే దేశ సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని స్పష్టం చేశారు. అంతర్గత భద్రత, సరిహద్దు నిర్వహణలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ సందర్భంగా అమిత్ షా ప్రస్తావించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానం క్షేత్రస్థాయిలో అమలు కావడాన్ని దేశం మొదటిసారిగా చూసింది. ఆర్టికల్ 370 రద్దు, సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి నిర్ణయాలు జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించి భారత్ ఇక కేవలం దౌత్యపరమైన ఖండనలకే పరిమితం కాదని నిరూపించాయి. నిర్ణయాత్మకమైన సమాధానాలను ఇస్తుందని ప్రపంచానికి చాటిచెప్పాయి. దేశంలో అంతర్గత తిరుగుబాట్లను సమర్థవంతంగా అదుపు చేశాం. అలాగే దీర్ఘకాలిక ప్రాదేశిక, జాతిపరమైన సమస్యలు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. నక్సలిజాన్ని నిర్మూలించాం. ఈశాన్య ప్రాంతంలో దశాబ్దాల నాటి వివాదాలు శాంతి ఒప్పందాల ద్వారా పరిష్కారమయ్యాయి. దేశ సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయి. దేశ అభివృద్ధి అజెండాలో జాతీయ భద్రత అనేది ఒక కీలకమైన పునాది. "

**కర్ణాటక ప్రజలకు షా శుభాకాంక్షలు**

మరోవైపు, హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు నిజాంలు, రజాకార్ల క్రూర పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులకు కేంద్ర హోం అమిత్ షా నివాళులర్పించారు. ఈ క్రమంలో కర్ణాటక ప్రజలకు హైదరాబాద్ విమోచన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చారిత్రక దినం భావి తరాలకు దేశభక్తి, ధైర్యసాహసాల స్ఫూర్తిని నిరంతరం గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. "హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా కర్ణాటక ప్రజలకు శుభాకాంక్షలు. అవిభక్త భారతదేశాన్ని నిర్మించే క్రమంలో నిజాంలు, రజాకార్ల క్రూర పాలనను అంతం చేసిన స్వేచ్ఛా కాంక్ష, దేశభక్తి అనే అజేయమైన స్ఫూర్తిని ఈ రోజు భావి తరాలకు గుర్తుచేస్తూనే ఉంటుంది. స్వాతంత్ర్య పోరాట అమరవీరులకు వందనాలు." అని ఎక్స్‌లో అమిత్ షా మరో పోస్ట్ పెట్టారు.

**ప్రధానికి ముర్ము, చంద్రబాబు, పవన్ పుట్టినరోజు శుభాకాంక్షలు**

మరోవైపు, గురువారం నరేంద్ర మోదీ పుట్టిన రోజు కావడంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు ప్రధానికి శుభాకాంక్షలు తెలియజేశారు. గడిచిన 25 ఏళ్లలో ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సుపరిపాలనను అందించారని నరేంద్ర మోదీని ముర్ము కొనియాడారు. ఎన్నో నూతన ప్రమాణాలను నెలకొల్పారని ప్రశంసించారు. ఈ ప్రజా సేవను మరింతకాలం కొనసాగించేలా మోదీ మరింత ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీ నాయకత్వం నిజంగా చరిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి ఒక గొప్ప ప్రజాదరణ పొందిన ప్రధానిగా దేశాన్ని నడిపించడం వరకు 25 ఏళ్ల మోదీ ప్రజాసేవ భారత్ అభివృద్ధి ప్రయాణానికి నూతన వేగాన్ని ఇచ్చిందన్నారు. మోదీ సేవాగుణం, సంకల్పం, సుపరిపాలన, విజన్ దేశంలోని 140 కోట్ల మంది ప్రజల్లో స్ఫూర్తి నింపుతోందని అభిప్రాయపడ్డారు. భరతమాత సేవలో నిరంతరం శ్రమిస్తున్న మోదీకి వేంకటేశ్వర స్వామి ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నానని అన్నారు.

**మోదీకి దేవేగౌడ బర్త్ డే విషెస్**

ప్రధాని నరేంద్ర మోదీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు మాజీ ప్రధాని, జనతా దళ్ (సెక్యులర్) అధినేత హెచ్‌డీ దేవెగౌడ. గురువారం మోదీ జన్మదినం కావడంతో విషెష్ చెబుతూ ఓ లేఖను రాశారు. దీన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. నరేంద్ర మోదీ సుదీర్ఘకాలం జీవించాలని, ఆరోగ్యంగా ఉండాలని దేవేగౌడలో లేఖలో ఆకాంక్షించారు. దేశాన్ని ముందుకు నడిపించడంలోనూ, దేశ సేవలోనూ నిరంతరం శక్తిని కలిగి ఉండాలని అన్నారు.

## '140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నాం'




రష్యా నుంచి మురు కొనుగోలు చేసే దేశాలపై సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించటంపై భారత్ దీటుగా స్పందించింది. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతను కాపాడటానికి కట్టుబడి ఉన్నామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇంధన అవసరాలను వివిధ వనరుల నుంచి తీర్చుకుంటూ, మారుతున్న అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది.

అమెరికా ప్రతిపాదిత ఆంక్షల ప్రభావంపై భారత్ గత కొన్ని నెలలుగా ఆ దేశ అధికారులతో చర్చలు జరిపినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపైనా ఈ తరహా చర్యల ప్రభావం ఉండొచ్చని భారత ప్రతినిధులు అమెరికా అధికారులకు వివరించినట్లు వెల్లడించింది. ఇంధన దిగుమతుల విషయంలో భారత్ ఒకే దేశంపై ఆధారపడకుండా వివిధ మార్గాలను అనుసరిస్తోందని కేంద్రం పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితులు మారుతున్న కొద్దీ కొనుగోలు వనరులను కూడా సర్దుబాటు చేసుకుంటామని తెలిపింది. అమెరికా బిల్లు ముందుకు సాగుతున్న నేపథ్యంలో భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, తదుపరి పరిణామాలను బట్టి ప్రభుత్వం స్పందిస్తుందని తెలిపింది. అదే సమయంలో దేశీయ వాణిజ్య, పరిశ్రమల సంస్థలతో కలిసి పనిచేసి కొత్త పరిణామాల వల్ల ఎదురయ్యే ప్రభావాలను ఎదుర్కొనేందుకు చర్యలు చేపడతామని పేర్కొంది.

**అమెరికా సభలో బిల్లుకు ఆమోదం**

రష్యా, ఇరాన్‌పై ఆంక్షలను మరింత కఠినతరం చేసే 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'కు అమెరికా ప్రతినిధుల సభ బుధవారం ఆమోదం తెలిపింది. మొత్తం 262 మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 159 మంది వ్యతిరేకించారు. ఇప్పటికే అమెరికా సెనెట్‌లోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించింది. దీంతో తదుపరి ప్రక్రియ కోసం బిల్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వద్దకు వెళ్లింది. ఈ చట్టంలో రష్యా ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, బ్యాంకింగ్ వ్యవస్థతో పాటు ఆ దేశ ఇంధన ఎగుమతులకు సంబంధించిన సంస్థలు, నౌకలపై చర్యలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. ముఖ్యంగా రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేసే ప్రధాన దేశాలపై అమెరికా అదనపు ఒత్తిడి తీసుకొచ్చేలా నిబంధనలు రూపొందించారు.

**భారత్‌కు 100 శాతం సుంకం ముప్పు?**

ఈ బిల్లులోని కీలక నిబంధన అమెరికా అధ్యక్షుడికి రష్యా పెట్రోలియం లేదా సహజవాయువు దిగుమతి చేసుకునే ఐదు అతిపెద్ద దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం కల్పిస్తుంది. రష్యా చమురు కొనుగోలు చేసే ప్రధాన దేశాల్లో భారత్, చైనా ఉండటంతో ఈ నిబంధనల ప్రభావం భారత్‌పైనా పడే అవకాశం ఉందనే చర్చ మొదలైంది. అయితే బిల్లు ఆమోదమైనంత మాత్రాన భారత్‌పై తక్షణమే 100 శాతం సుంకం అమల్లోకి వచ్చినట్లు కాదు. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత, అందులో పేర్కొన్న పరిస్థితులు నెరవేరితే అమెరికా అధ్యక్షుడు ఆ అధికారాన్ని వినియోగించాల్సి ఉంటుంది. అంటే ప్రస్తుతానికి ఇది తక్షణ సుంకం కాకుండా భవిష్యత్తులో సుంకం విధించే అవకాశం కల్పించే చట్టపరమైన మార్గం మాత్రమే. రష్యాపై ఆంక్షలతో పాటు ఇరాన్‌కు సంబంధించిన ఆంక్షలను కూడా చేర్చారు. ట్రంప్ కోరిన మేరకు ఇరాన్‌పై ప్రస్తుతం ఉన్న ఆంక్షలను మరో ఐదేళ్లు పొడిగించే అంశం కూడా బిల్లులో ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

# పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

స్వరం వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని గుర్తుచేశారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందన్నారు. సమ్మక్క--సారలమ్మల పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం అని కితాబిచ్చారు. ఆ సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందన్నారు.



### నిజాం పాలనలో పురోగతి..

‘భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. కానీ అప్పటి హైదరాబాద్ రాష్ట్రం నిజాం పాలనలోనే కొనసాగింది. నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో పురోగతి సాధించింది. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచస్థాయి గుర్తింపును అందుకుంది. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణిచివేత తీవ్రంగా ఉండేది. చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోలపరిచాయి. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు పోరాటాలకు నాయకత్వం వహించారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో సైనిక చర్య చేపట్టారు. ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. అది నిజాం పాలకుల అధికారం ముగిసిన రోజు మాత్రమే కాదు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం ‘ప్రజా పాలన దినోత్సవం’గా జరుపుకుంటున్నాం’అని రేవంత్ రెడ్డి వివరించారు.

### వరంగల్‌లో టిమ్స్ ఆసుప్రతి..

ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ‘అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2,000 పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం’అని తెలిపారు.

### రహదారులు అభివృద్ధికి సూచిక..

డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని సీఎం తెలిపారు. ‘ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. ఆర్అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ.6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం’అని సీఎం వివరించారు.

### సీఎం ఇంకా ఏమన్నారంటే...

తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఒకోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. మహిళా మార్ట్‌లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. మహిళను కేవలం లబ్ధిదారుగా కాకుండా.. ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా నిలబెట్టాలన్నదే మా లక్ష్యం.

కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.

ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.72 లక్షల కోట్లు ఖర్చు చేశాం.

ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ.22,500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని సీఎం తేల్చిచెప్పారు. అందుకే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.

# నాటి అసంఖ్యాక సవాళ్లకు హైదరాబాద్ చరిత్ర ప్రతిబింబం

-మొదటిపేజీ తరువాయి

రచయితలు, సామాజిక, రాజకీయ కార్యకర్తలు, రైతులు సహా సామాన్య పౌరులు కూడా ఈ పోరాటంలో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. ఈ క్రమంలో అనేకమంది కఠిన కారాగార వాసం, హింస, అంతులేని వ్యక్తిగత కష్టనష్టాలకు గురయ్యారని తెలిపారు. రామ్‌జీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ వంటి దేశభక్తులకు ఈ సందర్భంగా ఆయన నివాళులర్పించారు. గురువారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ హైదరాబాద్ విమోచన దినోత్సవంలో రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.




### ఏకీకృత సమైక్య భారత్‌కు పటేల్ పునాది

‘స్వతంత్ర భారత చరిత్రలో ఓ కీలక ఘట్టానికి హైదరాబాద్ సంస్థాన విమోచనం ముగింపు పలికింది. జాతీయ సమగ్రత, సార్వజనీనతకు బాటలు వేయాల్సిన ఆవశ్యకతను ఈ ఘట్టం మనకు గుర్తుచేస్తుంది. ఈ సంస్థాన విమోచనం ద్వారా బలమైన, ఏకీకృత సమైక్య భారత దేశానికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢమైన పునాది వేశారు. దేశ ఐక్యత కోసం పౌరులందరూ ఒకే రీతిలో ఉండాల్సిన అవసరం లేదు. భిన్న భాషలు, విభిన్న సంప్రదాయాలు, విశ్వాసాలు గలవారై ఉండవచ్చు. అదేవిధంగా భిన్న రాజకీయ అభిప్రాయాల గలవారూ ఉండొచ్చు. అంతిమంగా రాజ్యాంగం, సార్వకచిమాధికారం ప్రజలకే చెందుతాయన్న వాస్తవమే వారిని ఏకతాటిపై నిలుపుతుంది. నేటి వేడుక ఒక చారిత్రక తేదీ సంస్మరణకు మాత్రమే పరిమితం కాబోదు. ఇది భారత ప్రగతి ప్రస్థానాన్ని, దేశ సమైక్యతను సమున్నతంగా నిలిపే విలువలను గుర్తుచేసే సందర్భం.

### కేంద్ర బలగాల కీలక పాత్ర

1947--1948 మధ్యకాలంలో దేశ నిర్మాణంలో కేంద్ర బలగాలు ఎంతో కృషి చేశాయి. నక్సల్ రహిత భారత్, ప్రతి రాష్ట్రం ప్రశాంతంగా శాంతి భద్రతల సమస్యలు లేకుండా ఉండాలన్నది ప్రధాని మోదీ లక్ష్యం.. విజన్. ఇందులో భాగంగా నక్సలిజం నిర్మూలనలో కూడా ఈ బలగాలు ఎంతో కీలక పాత్ర పోషించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో, పర్యవేక్షణలో వామపక్ష తీవ్రవాదమైన నక్సలిజం దేశంలో అంతమైంది. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం పూర్తిగా కనుమరుగైన తర్వాత ఎంతో అభివృద్ధి జరుగుతోంది. రాష్ట్రంలోని యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారు. తర్వాత సంస్థానాల ఏకీకరణకు పటేల్ ఎనలేని కృషి చేశారు. తదుపరి తరంలో నేడు ‘వికసిత భారత్--2047’దిశగా ప్రస్థానానికి ప్రధాని మోదీ సమర్థ సారథ్యం వహిస్తున్నారు..’అని ఉప రాష్ట్రపతి చెప్పారు.

### హైదరాబాద్‌కు, జోద్‌పూర్‌కు మధ్య అనుబంధం: షెకావత్

కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ.. ‘ఇది కేవలం స్వాతంత్ర్య దినోత్సవం కాదు..సంకల్ప దినోత్సవం. జాతీయ ఏకతా దినం. హైదరాబాద్ విమోచన దినోత్సవం నుంచి ప్రేరణ పొంది సంకల్పబద్ధంగా ముందుకు సాగి, దేశం వికసిత్ భారత్ వైపు సాగేందుకు సంకల్పం ఉపకరిస్తుంది. దేశంలో అంతే ముఖ్యమైన పరివర్తన ఇప్పుడు మోదీ నేతృత్వంలో సాగుతోంది. సర్దార్ పటేల్ సాహసోపేత ‘ఆపరేషన్ పోలో’అన్యాయంపై న్యాయం సాధించిన విజయం. ఇందులో నా స్వస్థలం జ్యోద్‌పూర్‌కు చెందిన సైనిక యోధులు, మా పూర్వీకులు, కుటుంబీకులు కూడా పాల్గొనడం నాకెంతో గర్వకారణం. ఆ విధంగా హైదరాబాద్‌కు జ్యోద్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధం ఉంది. నేను ఇక్కడికి జోద్‌పూర్ ప్రతినిధిగా వచ్చా..’అని షెకావత్ అన్నారు.

### వికసిత్ భారత్ దిశగా పునరంకితం కావాలి: గవర్నర్

గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగిస్తూ..జాతీయ చరిత్రలో హైదరాబాద్ విమోచన అత్యంత విశిష్టమైన, చారిత్రాత్మక దినమని చెప్పారు. నాటి పోరాటాలు, పూర్వీకులు పడిన కష్టానష్టాలు, బలిదానాలను నేటి యువత అర్థం చేసుకుని.. ఆ అనుభవాలు, వీరసైనికుల పోరాటం, త్యాగాల పునాదిగా వికసిత్ తెలంగాణ తద్వారా వికసిత్ భారత్ సాధన దిశగా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

### వాళ్లెందుకు పోరాడాల్సి వచ్చింది: కిషన్‌రెడ్డి

‘నిజాం మంచి వాడని పాలకులు అంటున్నారు. అద్భుతమైన పాలన అందించి ఉంటే వందేమాతరం రామచంద్రరావు, భాగ్యరెడ్డి వర్మ, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య వంటి ఎంతోమంది మహానుభావులు నిజాం అణచివేతకు వ్యతిరేకంగా ఎందుకు పోరాడాల్సి వచ్చింది?..’అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాంను కీర్తించిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### రజాకార్ల ఆగడాలను కప్పిపుచ్చే ప్రయత్నం: బండి

రాష్ట్రానికి చెందిన కొందరు నేతలు నిజాం గొప్పోడనే పరిస్థితి రావడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రంలో రజాకర్ల అఘాయిత్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

### జాతీయ జెండా ఆవిష్కరించిన ఉప రాష్ట్రపతి

తొలుత పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద ఉప రాష్ట్రపతి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగురవేశారు. కేంద్ర బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాగా కేంద్ర బలగాలకు సంబంధించిన 10 బృందాలు డప్పు, డోలు, కోలాటం, గుస్సాడి, శివసత్తులు, లంబాడీ, బతుకమ ?మ, పేరిణి శివతాండవం కళా, నృత్యరూపాల ప్రదర్శించాయి. ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు బేగంపేట ఎయిర్‌పోర్టులో పలువురు నేతలు, అధికారులు ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికారు.

# ‘మంత్రి పదవి కంటే పీసీసీ పదవే పెద్దది’

ఢిల్లీ : ఈ నెలాఖరుకు పార్టీ పదవులు, కార్పొరేషన్లు, డైరెక్టర్లు, డిసీసీ బ్యాంక్ చైర్మన్లు, డీసీసీ పదవులు భర్తీ చేస్తామని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో పలు విషయాలను పంచుకున్నారు మహేష్ కుమార్ గౌడ్. ఈ క్రమంలోనే తన మంత్రి పదవి గురించి కూడా కాస్త భిన్నంగా స్పందించారాయన. తనను ఎవరూ మంత్రి పదవి తీసుకోమని ఎవరూ అడగలేదని, అయినా మంత్రి పదవి కంటే పీసీసీ పదవే పెద్దదే అంటూ సరదాగా వ్యాఖ్యానించారు మహేష్‌గౌడ్. ‘వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా నలుగురిని నియమిస్తాం. ఎస్సీ ,ఎస్టీ ,మైనార్టీ, జనరల్ కేటగిరీలకే ప్రాధాన్యత. తెలంగాణ ఇంచార్జ్ ఎవరినేది అధిష్టానం నిర్ణయం. ఇచ్చిన హామీలు అమలు చేస్తాము....8 లక్షల కోట్లకు అప్పు కడుతున్నాం. కేటీఆర్ వాళ్ళ తాతలు ఇచ్చిన భూమి అంటున్నారు చూపెట్టండి. ప్రజా జీవితంలో వచ్చిన తర్వాత లెక్కలు అఫిడవిట్ లో చూపెట్టాలి. రాజకీయాలను వ్యాపారం చేస్తామంటే జనం అన్ని గమనిస్తున్నారు. అందరూ కూడా ప్రజా రాడార్‌లో ఉన్నారు. కాంగ్రెస్ దళితులను రాష్ట్ర పతులను,కేంద్రమంత్రులు చేసింది. ఇందిరాగాంధీ కోరుకున్నదే సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారు. దళితులకు భూములు ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం. కాంగ్రెస్ నేతల ప్రాపర్టీ ఉంటే బయట పెట్టండి.. చర్యలు ఉంటాయి. 2014 నుంచి 2025 వరకు భూ దోపిడి జరిగింది. 22ఏ కారణంగా ఎవరు ఇబ్బంది పడొద్దు అది పార్టీ పాలసీ’ అని పేర్కొన్నారు.

## డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా

-మొదటిపేజీ తరువాయి

చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా పోస్టుద్వారా అర్హత ధ్రువీకరణపత్రాలు జతపరిచి ఫారం 8 సమర్పించాలని సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

ముఖ్యమైన తేదీలు ఇవే :

ఓట్ల నమోదుకు నోటిఫికేషన్ – సెప్టెంబర్ 28
పట్టభద్రుల ఓటరు దరఖాస్తుల స్వీకరణ – నవంబర్ 6 వరకు
ముసాయిదా ఓటరు జాబితా విడుదల – నవంబర్ 25
అభ్యంతరాల స్వీకరణ – నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు
పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల – డిసెంబర్ 30

### గ్రాడ్యుయేట్స్ ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

అధికార కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. తెలంగాణలోని రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి వచ్చే ఏడాది మార్చి నాటికి ఎన్నికలు జరగాల్సి ఉంది. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్, వరంగల్--ఖమ్మం--నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎలక్షన్లు జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈ రెండు స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సురభి వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం 2027 మార్చి 29వ తేదీతో ముగియనుంది. అయితే ఎన్నికల ప్రక్రియకు ముందే గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర ప్రక్రియలు మొదలు కావాల్సి ఉంటుంది. పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్ల జాబితా సవరణకు నవంబర్ 1 అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. 2023 డిసెంబర్‌లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత, ఈ ఎన్నికలు ప్రభుత్వ పాలనపై గ్రాడ్యుయేట్ల అభిప్రాయాన్ని ప్రతిబింబించే ఎన్నికలుగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాలు, విద్య, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ నియామకాలు, యువతకు సంబంధించినటువంటి అంశాలు గ్రాడ్యుయేట్? ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది. దీంతో ఈ రెండు స్థానాలను హస్తం పార్టీ, ప్రభుత్వం రెండూ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఇప్పటి నుంచే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించినట్లుగా ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నల్గొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో గత ఎన్నికల సమీకరణాలు కీలకంగా మారాయి.

## ఫామ్ హౌస్‌లో సగానికిపైగా స్వాధీనం ఖాయం?

**మెదక్, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా అత్యంత ఆసక్తికరమైన, అంతకుమించి రహస్యమైన కేంద్రం ఏదైనా ఉందంటే అది సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్. ప్రారంభంలో కొద్దిపాటి ఎకరాల విస్తీర్ణంలో, కేవలం రెండు అంతస్తుల సాధారణ గెస్ట్‌హౌస్‌తో మొదలైన ఈ వ్యవసాయ క్షేత్రం.. కాలక్రమేణా వేల మీటర్ల పొడవాటి ప్రహరీ గోడలు, పటిష్టమైన నిఘా వ్యవస్థ, అత్యాధునిక రాజభవన సముదాయాలతో ఒక అభేద్యమైన కోటలా రూపాంతరం చెందింది. పార్టీలో సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం కేవలం ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన షెడ్డు వరకే అనుమతి ఉంటుంది. లోపల కనుచూపు మేరలో విస్తరించి ఉన్న ఆకుపచ్చని తోటలు, నిర్మాణాల లోగుట్టు సొంత పార్టీ శ్రేణులకు కూడా చిక్కేది కాదన్నది బహిరంగ సత్యం. పాలనా పగ్గాలు చేతిలో ఉన్నప్పుడు ఫామ్‌హౌస్ కేంద్రంగా సాగిన పాలన పై నిరంతరం ఎదురుదాడి చేసిన విపక్షాలకు, అది ఎప్పుడూ ఒక ఛేదించలేని రహస్య కేంద్రంగానే మిగిలిపోయింది.ఈ సుదీర్ఘ మిస్టరీకి తెరదించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా విచారణాస్త్రం సంధించడంతో ఎర్రవల్లి కోట చుట్టూ ఉన్న పొగమంచు వీడబోతోంది. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం అసలు పరిమాణం ఎంత? అందులో కేసీఆర్ స్వయంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి ఎంత? కౌలు పేరిట చేజిక్కించుకున్నది ఎంత? బినామీల పేరిట చుట్టుపక్కల విస్తరించిన భూభాగం ఎంత? అన్న లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఫామ్‌హౌస్ పరిధి సుమారు 700 ఎకరాలకు పైగా విస్తరించి ఉందని, అందులోనే ఏకంగా 340 నుంచి 388 ఎకరాల మేర అసైన్డ్, ప్రభుత్వ భూమి కలిసిపోయి ఉందన్న రేవంత్ ఆరోపణలతో అధికార యంత్రాంగం సమగ్ర భూ సర్వేకు నడుం బిగించింది. జిల్లా కలెక్టర్, రెవెన్యూ విభాగాలకు 30 రోజుల స్పష్టమైన డెడ్‌లైన్ విధించడం ఈ విచారణ తీవ్రతను స్పష్టం చేస్తోంది.ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి ఆస్తిపాస్తుల పరిశీలన మాత్రమే కాదు. ల్యాండ్ సీలింగ్ చట్టం, ధరణి పోర్టల్ సమగ్రతపై జరుగుతున్న అతిపెద్ద న్యాయ-పరిపాలనా పరీక్ష. తెలంగాణ అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక కుటుంబ యూనిట్‌కు గరిష్ట పరిమితి ఉండగా, కేసీఆర్ కుటుంబం అధికారికంగానే దాదాపు 439 ఎకరాలను ఎలా కలిగి ఉందన్న సాంకేతిక చిక్కును కాంగ్రెస్ ప్రభుత్వం లేవనెత్తుతోంది. అంతేకాకుండా, గత ప్రభుత్వ హయాంలో ధరణి ద్వారా రికార్డులను నిషేధిత జాబితా నుంచి తొలగించారా? స్థానిక రైతుల వద్ద నుంచి తీసుకున్న భూములకు చట్టబద్ధమైన బదలాయింపులు జరిగాయా? లేక అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని హద్దులు విస్తరించారా? అనే అంశాలపై డ్రోన్ సర్వేలు, పాత పహాణీల రికార్డులు పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసే అవకాశముంది.ఒకవేళ విచారణలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణ నిజమని తేలితే, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని దళిత, పేద వర్గాలకు పంచుతామన్న ప్రభుత్వ ప్రకటన బీఆర్ఎస్ అధినేతను ఆత్మరక్షణలోకి నెడుతుంది. ఇన్నాళ్లూ ప్రగతిశీల వ్యవసాయం , ఆధునిక సేద్యం పేరుతో ప్రచారం చేసుకున్న మోడల్ ఫామ్‌హౌస్ వెనుక అసలు కథ ఏమిటన్నది ఇప్పుడు అధికారిక డాక్యుమెంట్ల సాక్షిగా బట్టబయలు కానుంది. రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ దూకుడు అడుగుతో, దశాబ్ద కాలంగా ఎవరికీ అంతుచిక్కని కేసీఆర్ ఫామ్‌హౌస్ రహస్యాలు ప్రజాక్షేత్రంలో బట్టబయలయ్యే ఘట్టం సమీపించినట్లే కనిపిస్తోంది.

## మోడీ జీవితంలో అరుదైన రికార్డ్స్

**న్యూఢిల్లీ :** సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో మొదటిది ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల్లో ‘సేవా సంకల్ప అభియాన్’ (సేవా సంకల్ప ఉద్యమం). ఈ సందర్భంగా రోడ్లు, మురుగునీటి పారుదల, విద్య, విద్యుత్ వంటి పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని, ఢిల్లీలోని ‘దర్భవాయి మార్గం’ (కర్తవ్య మార్గం) వెంబడి 1.25 లక్షల ఆశీర్వాద దీపాలను వెలిగించారుప్రధాని మోదీ రాజకీయ జీవితం విషయానికి వస్తే, ఆయన అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2014 నుండి భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2014లో లోక్‌సభ ఎన్నికలలో గెలిచి ఆయన తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి చెందిన కొన్ని ముఖ్యమైన రికార్డులు, విజయాలను పరిశీలిద్దాం.

వరుసగా అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి రికార్డు: 2026 జూన్ 10న, ప్రధానమంత్రి మోదీ వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా పనిచేసి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజుల రికార్డును అధిగమించారు. దీంతో ఆయన అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి అయ్యారు.

ప్రభుత్వాధినేతగా సుదీర్ఘ పదవీకాలం: 7 అక్టోబర్ 2001న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా మొత్తం సుమారు 25 సంవత్సరాల పాటు ప్రభుత్వాధినేత పాత్రను పోషించారు. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికలలో విజయం: 2014 నుండి నరేంద్ర మోదీ వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికలలో తన పార్టీ, కూటమికి నాయకత్వం వహించారు. ఈ ఎన్నికల తరువాత ఆయన వరుసగా మూడవసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో లోక్‌సభలో ఆయనకు ఇది వరుసగా మూడవ విజయం. గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు: నరేంద్ర మోదీ అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఈ కాలంలో, ఆయన నాయకత్వంలో బీజేపీ రాష్ట్రంలో వరుస ఎన్నికల విజయాలను సాధించింది. విదేశీ పురస్కారాల రికార్డు: ప్రధానమంత్రి మోదీ వివిధ దేశాల నుండి 30కి పైగా ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. విదేశాల నుండి ఒక భారత ప్రధానమంత్రికి లభించిన అత్యధిక విదేశీ పురస్కారాలు ఇవే. వీటిలో సియోల్ శాంతి బహుమతి, ఫిలిప్ కోట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు, ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డు (ఆఫ్ఘనిస్తాన్ అత్యున్నత పౌర పురస్కారం), సౌదీ అరేబియా రెండవ అత్యున్నత పౌర పురస్కారం, ఈజిప్ట్ అత్యున్నత పౌర పురస్కారం వంటివి ఉన్నాయి.

నవగీతం తెలుగు దినపత్రిక

శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

## సంపాదకీయం

# రాహుల్ బలమా... బలహీనత

రాహుల్ గాంధీది భారత రాజకీయాల్లో ఒక నిలకడ లేని గ్రాఫ్! అది కొన్ని సార్లు పైకి, మరికొన్నిసార్లు కిందకి చలిస్తూ ఉంటుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాలు సదా అనిశ్చితిలో ఉంటున్నాయి. దాని ప్రతికూల ప్రభావం 'ఇండియా కూటమి' మీద పనిచేస్తోంది. రాహుల్ ప్రాధాన్యతలు, ప్రవర్తన, మిత్రులతో సయోధ్య వంటి అంశాలు ఈ మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మీడియా, సెఫాలజీ సంస్థల అంచనాలకు మించి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలతో ఏర్పడ్డ 'ఇండియా కూటమి' మెరుగైన ఫలితాలు సాధించింది. దేశంలోని 16 ముఖ్య సెఫాలజీ సంస్థలు ఇండియా కూటమి సంఖ్య 150 దాటదని జోస్యం చెప్పినా, 240 స్థానాలు పొంది ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇచ్చింది. 400 సీట్ల వారి కలల్ని కల్లలు చేసి, 290కి పరిమితం చేసింది. కానీ, తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పక్షాలు దారుణంగా దెబ్బతిన్నాయి. సానుకూల ఫలితాలకు ఆస్కారమున్న మహారాష్ట్ర, హర్యానా, బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా చతికిలపడ్డాయి. ఇందుకు ప్రధానంగా రాహుల్ (గ్రాఫ్) నిలకడలేని తనమే కాకుండా మిత్రపక్షాలతో కాంగ్రెస్ అనుసరించే అస్పష్ట వైఖరి, వ్యూహ వైఫల్యాలూ కారణమే! ఇదంతా బిజెపికి, అది నేతృత్వం వహించే ఎన్‌డిఎకి పరోక్షంగా మేలు చేస్తోంది. 'మా స్టార్ క్యాంపెయినర్ రాహుల్ గాంధీయే' అనే కొందరు బిజెపి నేతల వ్యంగ్య వ్యాఖ్యల్లోని 'హాస్యం' కన్నా వాస్తవికతే జనాల్ని ఎక్కువ ఆలోచింపజేస్తోంది. రాహుల్ గాంధీ రాజకీయ ప్రగతి సూచీ స్థిరంగా ఉండకపోవడానికి ఆయన ప్రాధాన్యతలు, ప్రవర్తనే కారణమని మేధావులు, రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తారు. 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఎక్కువ జనాదరణతో ఉన్నారు. 2019 ఎన్నికల ముందరితో పోల్చి చూస్తే, 2024 ముందర పలు సర్వేల జనాదరణలో ప్రధాని అభ్యర్థిగా మోడీకి కొంత సమీపంలోకి రాహుల్ రాగలిగారు. అప్పటికి దేశాన్ని చుట్టేస్తూ ఆయన అడ్డంగా, పొడువుగా రెండు పాదయాత్రలు చేసి ఉన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా ఎండగడుతూ పార్లమెంటులో చక్కని, ప్రభావవంతమైన ప్రసంగాలు చేస్తున్నారు. ప్రధాని మోడీకి, పారిశ్రామికవేత్త అదానీకి వీడదీయరాని బంధముందని చేసిన పార్లమెంట్ ప్రసంగం ఆకట్టుకుంది. కానీ, ఆ స్థిరత్వం 2024 ఎన్నికల తర్వాత కొనసాగలేదు. మారిన రాజకీయాల్లో నాయకుల అటెన్షన్ 24/7 గంటలు ప్రజలు ఆశిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రక్రియ నుంచి రాహుల్ తరచూ 'సెలవుల'పై వెళ్లడాన్ని జనం వింతగా చూస్తున్నారు. 'ఇతనికి సీరియస్‌నెస్ లేదు' అనే వ్యాఖ్య జనంలో తరచూ వినిపిస్తోంది. భారత్‌లో పరిస్థితుల్ని ఎత్తిచూపుతూ విదేశాల్లో చేసిన విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన పలుకుబడిని, నిబద్ధతని కొంత ఇరకాటంలో పెట్టాయి. ఆ క్రమంలో కిందకు జారిపోయిన రాహుల్ 'ఇమేజ్ గ్రాఫ్' ఇటీవల మళ్లీ ఊర్ధ్వముఖంగా సాగుతోంది. పాలక ఎన్‌డిఎ ఎదుర్కొన్న కొన్ని విపరిణామాలు, 'పేపర్ లీక్, 'చందాచోర్' 'జిడిపి గ్రోత్ రేట్ వివాదం' వంటి వాటిపై ప్రతికూలంగా వచ్చిన విస్తృత ప్రజాభిప్రాయం బిజెపిని ఇరుకున పెట్టడమే కాకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాల విమర్శలకు కొంత వెయిటేజీ పెంచింది.. ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఎంతో దన్నుగా ఉండి, కాలక్రమంలో, ముఖ్యంగా 2014 తర్వాత క్రమంగా దూరమైన దళితవర్గాల్ని పూర్తిగా తమవైపు తిప్పుకునే ప్రయత్నం జరుగుతోంది. 'దేశంలోనే అతిపెద్ద విపక్ష పార్టీ అధినేత (మల్లికార్జున్ ఖర్గే) కే ఈ గతిపడితే, ఇక దేశంలో సామాన్య దళితుల సంగతేమిటి?' అని రాహుల్ ప్రశ్నిస్తున్నారు. ఖర్గే పాల్గొన్న సభా వేదికను 'శుద్ధీకరణ' పేరిట ప్రక్షాళన చేసిన 'బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, దళిత వ్యతిరేక భావజాలం' అంతా ఒకటే అని ఆయన ప్రచారం చేస్తున్నారు. ఆ వరుసలోనే, మహిళా బిల్లు కంటితుడుపు చర్య చేసి, అమలును నిర్లక్ష్యం చేస్తున్న ఎన్‌డిఎది పురుషాధిక్య 'మనుస్మృతి' భావజాలమని, వారు మహిళల రిజర్వేషన్ అమలు చేయరనే వాదనను ఆయన జనంలోకి తెస్తున్నారు. 'క్షాత్రోంకీ గూంజ్' విద్యార్థులు, యువజనుల సదస్సులకు హాజరై బిగ్గరగా వారి అనుకూల స్వరం వినిపించడం ద్వారా జన్-జీ. జన్- ఆల్ఫాను ఆకట్టుకునే ప్రయత్నం రాహుల్ చేస్తున్నారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు దూరమైన యువతను, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఆకట్టుకుని, తమవైపు తిప్పుకునే వ్యూహంలో భాగమిది. తమ ఒత్తిడిపై దేశంలో కులగణనకు ఎన్‌డిఎ ప్రభుత్వం సిద్ధపడినా, ఒబిసిలకు న్యాయం చేయటం లేదనే విమర్శను కాంగ్రెస్ నాయకత్వం ఎత్తుకుంది. ఒబిసిలకు తాము అనుకూలమంటూ బిజెపి చేసుకునే ప్రచారం ఉత్తిదేనని, కులగణనలో ఎస్‌సి, ఎస్‌టిల మాదిరి బిసిలకు ప్రత్యేకంగా కాలమ్ పొందుపరచకపోవడాన్ని రాహుల్ తప్పుబడుతున్నారు. టిఎంసి, ఎన్‌సిపి, డిఎంకె, ఆప్.. తదితర పక్షాలతో, వివిధ రాష్ట్రాల్లో ఇది పలు సందర్భాల్లో రుజువయింది. సానుకూల వాతావరణంలో కూడా ప్రతికూల ఎన్నికల ఫలితాలకు ఈ సఖ్యత కొరవడటమే కారణం. ఇక ముఖ్యమైన ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాద్ (ఎస్‌పి) తో కాంగ్రెస్ సఖ్యత ఎలా ఉంటుంది? అన్నది కీలకం. 2029 సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందర అసెంబ్లీ ఎన్నికలు (ఫిబ్రవరి -2027) జరగాల్సిన యుపి ఏ రకంగా చూసినా ఇండియా కూటమికి ముఖ్యమైందే! 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌పి (36.6% ఓటు వాటా), కాంగ్రెస్ నేతృత్వపు యుపిఎ (2.33% ఓటు వాటా) విడివిడిగా పోటీ చేసి దెబ్బతిన్నాయి. 2024 లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఇండియా కూటమి, ఎస్‌పి 37, కాంగ్రెస్ 6, మొత్తం 43 ఎంపి స్థానాల (43.52% ఓటు వాటా) తో లబ్ధి పొందింది. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి వైఖరి అనుసరించనున్నారు? అన్నది కీలకం. ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ పలు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. పిచ్‌డే- దళిత్- అల్పసంఖ్యాక్/ పిడిఎ వ్యూహం ఆయన చేతిలో అస్త్రంగా ఉంది. బలహీనవర్గాలు (పిచ్‌డే)కు తోడు 'పి' అంటే 'పండిట్' కూడా అని ఇటీవలే ఒక సభలో వివరణ ఇచ్చిన అఖిలేశ్, బ్రాహ్మణ వర్గానికి చేరువ కావాలని చూస్తున్నారు. హిందుత్వ వాదనకు ఎస్‌పి వ్యతిరేకం కాదనే భావన వచ్చేలా.. 'సనాతన ధర్మం' ఈ దేశంలో ఐక్యత సాధించిందని కితాబిచ్చారు. ఒక వేదిక నుంచి 'హనుమాన్ చాలీసా' చదివారు. 'ఇటావా' నియోజకవర్గ పరిధిలో అఖిలేష్ చైర్మన్‌గా ఉన్న ఒక ట్రస్ట్ నిర్మిస్తున్న కేదారేశ్వర్ ఆలయం 2027 ఎన్నికలకు ముందరే ప్రారంభం కానుంది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ వల్లెవేస్తున్న 'మనుస్మృతి' కాంగ్రెస్ అనుసరించే 'హిందూ వ్యతిరేక' వైఖరికి నిదర్శనమని చెప్పేందుకు బిజెపి ప్రచారాస్త్రమవుతుందా? యుపిలో ఇది అఖిలేశ్‌తో పొసగని పొత్తు వ్యూహమవుతుందా? కాంగ్రెస్ కొంచెం ఆలోచించుకోవాలి!.

# కార్పొరేట్ చేతిలో మీడియా బందీ



ఇటీవల ఓటీటీలో తెలుగులో అందుబాటులో ఉన్న మలయాళ రాజకీయ చిత్రం 'ప్రతిఛాయ' చూశాను. రాజకీయ ఎత్తుగడలు ఎంత సంక్లిష్టంగా ఉంటాయో ఈ సినిమా ఆసక్తికరంగా చూపించింది. అయితే ఈ సినిమాలో నన్ను ఎక్కువగా ఆలోచింపజేసిన అంశం -- కార్పొరేట్ సంస్థలు రాజకీయాలను, ముఖ్యంగా మీడియాను తమ చేతుల్లోకి తీసుకున్నప్పుడు ప్రజాస్వామ్యంపై పడే ప్రభావం. సినిమాలో ఒక సందర్భంలో వచ్చే సంభాషణ ఇలా ఉంటుంది. కార్పొరేట్ కంపెనీలకు సొంతంగా మీడియా ఉంటే నిజం అబద్ధం అవుతుంది. అబద్ధం నిజం అవుతుంది. ఇది అక్షరాలా నేటి వాస్తవం.

ఒకప్పుడు మీడియా అంటే ప్రజల గొంతుకగా ఉండేది. ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికారంలో ఉన్నవారి తప్పులను బయటపెట్టడం దాని ప్రధాన బాధ్యత. కానీ మీడియా సంస్థలే భారీ కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లినప్పుడు పరిస్థితి పూర్తిగా మారుతుంది. ఏ వార్తను ఇవ్వాలి? ఎలా ఇవ్వాలి? దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి? దేనిని ప్రజలకు దూరంగా ఉంచాలి? అనే నిర్ణయాలను ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు శాసించే ప్రమాదం ఉన్నది. మన దేశంలో పదేండ్లలో ప్రధాన మీడియా సంస్థల్లో అనేకం పారిశ్రామికవేత్తలతో సంబంధం ఉన్న కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిన పరిస్థితిని మనం చూస్తున్నాం. వారికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అండదండలు ఉన్నాయి. అలాంటి యాజమాన్య మార్పుల నేపథ్యంలో మీడియా ఎలాంటి వార్తలకు ప్రాధాన్యత ఇస్తున్నది? ఎలాంటి వార్తలను విస్మరిస్తున్నది? అనేది ప్రతి పౌరుడూ గమనించాల్సిన అంశం.

రూపాయి విలువ పతనం, విపరీతంగా పెరుగుతున్న ధరలు పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. కుటుంబాల ఆదాయం పెరగలేదు. రోజువారీ అవసరాల ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుల నిత్య జీవితాలు భారంగా మారిపోయాయి. కానీ ఈ సమస్యలపై నిరంతర చర్చ, లోతైన విశ్లేషణ, ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం మీడియాలో ఎంతవరకు కనిపిస్తున్నది? విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో వైఫల్యాలు, నాణ్యమైన విద్య, వైద్యం సామాన్యుడికి అందకపోవడం, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం వంటి కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన బాధ్యత మీడియాపై ఉన్నది.

కానీ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి అసంబద్ధ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజల్లో ఉద్వేగాలను రెచ్చగొట్టే వార్తలను విస్తృతంగా ప్రచారం చేయడం, ప్రతిపక్షాల ప్రభుత్వాలు వారి వారి రాష్ట్రాల్లో మంచి పాలన అందిస్తుంటే ఓర్వలేక వారిపై ఆరోపణలు గుప్పించి, వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని కక్షపూరితంగా వ్యవహరించడం, ఇతర పార్టీలకు చెందిన నాయకులను బెదిరించి వారి పార్టీలో చేర్చుకోవడం మనం చూస్తున్నాం. వీటిపైనా మీడియాలో చర్చలు ఉండడం లేదు.

ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య, వైద్యం, ఉపాధి వంటి జీవన ప్రమాణాలను నిర్ణయించే అంశాలపై ప్రజలు ప్రశ్నలు అడుగకుండా, వారిని నిరంతరం భావోద్వేగ అంశాల చుట్టూ తిప్పడం ఒక రాజకీయ వ్యూహంగా మారింది. ఇది యువతను, మధ్యతరగతి ప్రజలను ఒక మత్తులో ఉంచి విచక్షణ కోల్పోయేలా చేస్తున్నది. మన రాష్ట్రంలో కూడా ఇదే జరిగింది. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, మంచిని మరుగుపరిచి, అబద్ధాలను ఓ వర్గం మీడియా ప్రచారం చేసింది. కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చి మభ్యపెట్టడం వల్ల ప్రజలు మోసపోయారు. ఫలితంగా నేడు జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిపోయింది. తెలంగాణ అభివృద్ధి గ్రాఫ్ పూర్తిగా పడిపోయింది. ఒకవేళ మీడియా స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసి ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం అయ్యేవి కావు. ప్రజాస్వామ్యం మరింత బలంగా ఉండేది.

ప్రజాస్వామ్యంలో మీడియా అంటే కేవలం వార్తలను అందించే సంస్థ కాదు. అది ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కీలకమైన వారధి. ప్రభుత్వం, ప్రతిపక్షంలో ఎవరు తప్పు చేసినా మీడియా ప్రశ్నించాలి. కార్పొరేట్ సంస్థలు తప్పు చేస్తే కూడా ప్రశ్నించాలి. మీడియా కార్పొరేట్ ప్రయోజనాలకు లొంగకుండా ప్రజా ప్రయోజనాలకు అద్దంగా నిలిచినప్పుడే, నిజం నిజంగానే ఉంటుంది. నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. లేకపోతే ప్రతిఛాయలో చెప్పినట్టుగా నిజం అబద్ధంగా మారుతుంది, అబద్ధం నిజంగా మారుతుంది. అప్పుడు ప్రమాదం ఒక వార్తకు, ఒక ప్రభుత్వానికి, ఒక పార్టీకి మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికే ప్రమాదం. అందుకే ప్రజలు కూడా వార్తలను గుడ్డిగా నమ్మకుండా, ఎవరు, ఏ విషయాన్ని, ఎందుకు చెప్తున్నారు? ఏ విషయాన్ని చెప్పడం లేదు? అనే ప్రశ్నలు వేసుకోవాలి. విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

# బ్రిటన్‌లో వేర్పాటు భేరి!



బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన 'ఉగ్రవాదంపై యుద్ధా'నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు 'సమష్టి రక్షణ'ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్ల వేటకు తోడ్పడ్డాయి.

కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవహక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణహోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చు గానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి. బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించాలనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు. మనతో సహా అనేక దేశాలను పీల్చిపిప్పిచేసిన బ్రిటన్ ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకోగలదా అన్నది వేచిచూడాలి.

## 'నూరుశాతం' తప్పుడు చర్య

తీసుకునే నిర్ణయాలన్నీ వికటిస్తున్న వైనం కనబడుతూనే ఉన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించే పేరిట ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధించటానికీ... దాన్నుంచి ముడి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా తోడ్పడుతున్న భారత్, చైనాలపై వంద శాతం సుంకాలు విధించటానికీ అనుమతించే బిల్లును ఆయన ప్రభుత్వం ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకుంది. గత నెల ఇదే బిల్లుకు సెనేట్ ఓకే చెప్పింది. తాజా ఆమోదంతో ఈ ఆంక్షల బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ అంగీకారం తెలిపినట్టయింది. దీనిపై ట్రంప్ సంతకం చేశాక చట్టంగా మారుతుంది. ఆ అధికారాన్ని ట్రంప్ వినియోగిస్తారా లేదా అన్నది చూడాల్సివుంది. రెండోసారి అధికారంలోకొచ్చాక రష్యాపై ట్రంప్ విధించ దల్చుకున్న ఈ ఆంక్షలు అత్యంత కీలకమైనవి. ఈసారి ఆంక్షలన్నీ రష్యా ఇంధన, రక్షణ రంగాలే లక్ష్యంగా రూపొందించారు. తన అభీష్టానికి విరుద్ధంగా ఇరుగు పొరుగు దేశాలు నిర్ణయాలు తీసుకుంటే వాటితో ద్వైపాక్షిక వాణిజ్యంతోసహా వివిధ బంధాలన్నిటినీ తెంచుకోవటం ఏ ప్రభుత్వమైనా చేసే పని. కానీ 'తన చావు జగత్ప్రళయమ'న్న రీతిలో ఆ పనే అందరూ చేసితీరాలనే డిమాండ్ మూర్ఖత్వం. అంతర్జాతీయంగా 80 ఏళ్ల క్రితం కుదిరిన ఒడంబడిక ప్రకారం దురాక్రమణ యుద్ధాలకు పాల్పడే దేశంపై ఎలాంటి చర్యలు అవసరమో ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి నిర్ణయిస్తాయి. రష్యా తప్పు చేస్తున్నదని అమెరికా భావిస్తే ఆ వేదికలద్వారా ఒత్తిళ్లు తీసుకురావాలి. అలా చేయలేననుకుంటే తనవరకూ ఇష్టానుసారం చేసుకోవచ్చు. అసలు ట్రంప్ అత్యుత్సాహంతో అమలు చేస్తున్న సుంకాల విధానంపై అమెరికాలోనే ఏకాభిప్రాయం లేదు. రష్యాపై కఠిన చర్యల్ని సమర్థిస్తున్న డెమోక్రాట్లు సైతం ట్రంప్‌కు అతిగా అధికారాలు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఏకపక్ష అధికారాలు అప్పగిస్తే దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు. మన దేశం గతంకన్నా దృఢంగా వ్యవహరించటం హర్షించదగ్గది. ప్రస్తుత విధానాన్ని విడనాడబోమనీ, మార్కెట్ చలనాలను నిర్దేశించే ధరవరలు, సరఫరా, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేయడం కొనసాగిస్తామనీ స్పష్టంచేసింది. వంద శాతం సుంకాలపై అమెరికా చర్యకు దిగితే ద్వైపాక్షిక సంబంధాలపై వాటి ప్రభావం పడుతుందని ఇప్పటికే అమెరికాకు తెలియ జేశామని తెలిపింది.

## హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలి.

**ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో రిలే నిరాహార దీక్ష**



**ములుగు, సెప్టెంబర్ 17,(నవగీతం)** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసినట్లు ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు దీక్ష నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈ అంశంపై నిరసనలు, పోలీసులకు ఫిర్యాదులు ఇవ్వడంజరుగుతున్నాయనీ అన్నారు. ఈ సందర్భంగా దీక్షా నిర్వహించే నాయకులు జన్ను రవి మాదిగ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ మాట్లాడుతూ, “భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అవమానకరంగా ఉన్న వ్యాఖ్యలు సమాజంలో ఆవేదనకు కారణమవుతున్నాయనీ ఈ వ్యవహారంపై ప్రభుత్వం, పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి” అని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఈస్ట్ చంటి భద్రయ్య మాట్లాడుతూ “రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మా నిరసన పూర్తిగా శాంతియుతమైనదనీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చట్టబద్ధమైన మార్గంలో మా డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం” అని తెలిపారు.

హమారా ప్రసాద్‌పై

చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.హమారా ప్రసాదను అరెస్టు చేసేంతవరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసన కొనసాగిస్తామని దీక్షా నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ ములుగు జిల్లా అధికార ప్రతినిధి బొమ్మ కంటి రమేష్ వర్మ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఇనుముల సుధాకర్ భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి కోకన్వీనర్ నద్దునూరి రమేష్ దళిత నాయకులు చంటి భద్రయ్య ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నరసయ్య మాదిగ మాడుగుల రమేష్ ఎంఆర్పీఎస్ ములుగు మండల ఇన్చార్జి కాడపాక శ్యామ్ మాదిగ ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు లాదెల్ల అశోక్ బోడ రాములు మాదిగ టిఎంఆర్పిఎస్ నాయకులు గడ్డం భద్రయ్య మాదిగ మాల మహానాడు నాయకులు గుండాల రఘు అంబేద్కర్ ఈస్ట్ గుల్లగట్టు సంజీవ బి ఆర్ పి ఎస్ జిల్లా నాయకులు అల్వాల రాజ్ కుమార్ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు కనకం దాస్ కెవిపిఎస్ నాయకులు రత్నం ప్రవీణ్ జన్ను దేవేందర్ సిపిఐ పార్టీ కార్యదర్శి జంపాల రవీందర్ సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు దళిత నాయకుడు రత్నం దామోదర్ కుర్రి దినాకర్ తంగేళ్ల మల్లన్న బోయిని సదయ్య మల్లం పెల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తాళ్లపేల్లి సాంబయ్య బూతుకూరు బూత్కూరి రవి తదితరులు పాల్గొన్నారు

## చేయూత పెన్షన్ దరఖాస్తుల ఇంటింటి పరిశీలన.



ఇల్లంతకుంట, సెప్టెంబరు 17 ( నవగీతం):మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఏపీఎం కుమారస్వామి  దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను పరిశీలించి, అర్హతకు సంబంధించిన సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేశారు.  అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా నమోదు చేస్తామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎన్నిక రామస్వామి,జీపీ కార్యదర్శి తిరుపతి రెడ్డి, సిసి విట్టల్ రెడ్డి, రాజిరెడ్డి, కవిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకలు



**రాయికల్, సెప్టెంబర్ 17,(నవగీతం)** రాయికల్ మండల, పట్టణ స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ నాగార్జున చారి హాజరై విశ్వకర్మ భగవానుడికి, వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం పొందారు. విశ్వకర్మ భగవానుడి కృపతో స్వర్ణకార కుటుంబాలన్నీ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం సంఘం సభ్యులు పరస్పరం విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు మూగల సంజీవ్ చారి, ప్రధాన కార్యదర్శి తోగిటి గోపి, కోశాధికారి పోలాచారి, ఉపాధ్యక్షుడు బ్రహ్మాచారి, పట్టణ సంఘం అధ్యక్షుడు దురిశెట్టి రంగయ్య, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి బెజ్జంకి పవన్, తుమ్మనపల్లి కృష్ణ, దురిశెట్టి ప్రశాంత్,  తొగిటి రమేష్,వట్టిమల్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు, రెండు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**రాయికల్, సెప్టెంబర్ 17,(నవగీతం)** మైతాపూర్ గ్రామ పారిశుధ్యాన్ని కాపాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మైతాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతినెలా సబ్బులు, సర్ఫ్, కొబ్బరి నూనె తదితర నిత్యావసర వస్తువులను అందజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెలకు సంబంధించిన సబ్బులు, సర్ఫ్, కొబ్బరి నూనె తదితర వస్తువులను దాత గంగుల శ్రీనివాస్ సహకారంతో కొనుగోలు చేసి గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ కస్తూరి సతీష్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ప్రతినిధులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతినెలా నిత్యావసర వస్తువులను అందజేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన దాత గంగుల శ్రీనివాస్‌కు గ్రామ పంచాయతీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మృణ్మయ పూజ -- భక్తి, ప్రకృతి పరిరక్షణకు ప్రతీక



**రాయికల్, సెప్టెంబర్ 17,(నవగీతం)** రాయికల్ పట్టణంలోని  విశ్వపాలిని సేవా సమితి మార్కండేయ మందిరం వారి ఆధ్వర్యంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మృణ్మయ పూజా కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా పురోహితులు గణపవరపు మల్లికార్జున శర్మ మాట్లాడుతూ  మృణ్మయ అంటే మట్టితో చేసినది, పూజ అంటే దైవాన్ని ఆరాధించడం.ఈ సంప్రదాయంలో ముందుగా మట్టితో శివలింగాన్ని తయారు చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. అనంతరం అదే మట్టి సంప్రదాయబద్ధంగా అమ్మవారి విగ్రహ రూపాన్ని సంతరించుకుని దేవీ నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుడుతుంది. ఉత్సవాలు ముగిసిన అనంతరం నిమజ్జనం ద్వారా మట్టి తిరిగి ప్రకృతిలో కలుస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం మరియు యువజన సంఘం సభ్యులు విగ్రహ దాతలు బాలే శేఖర్, జయశ్రీ, బాలే నిఖిల్ కుమార్ పాల్గొన్నారు.

## గణేష్ మండపాలా వద్ద అన్నదానం.

ప్రతి గల్లీలోనూ అన్నప్రాసదాలు.

అన్నదాత సుఖీభవ అంటూ భక్తుల ఆశీర్వచనలు..

భక్తిశ్రద్దలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు...





**భీంగల్ , సెప్టెంబర్ 17,(నవగీతం)** గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. దాదాపు వినాయక ప్రతిమ ప్రతిష్ఠించిన ప్రతిచోటా అన్నదానం తప్పనిసరయింది. నిజామాబాద్ జిల్లాల్లో గణేష్ నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు లంభోదరుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ ఘనంగ వేడుకలను నిర్వహిస్తున్నారు. వాడ వాడలో కొలువైన గణేష్ మండపాల వద్ద భజనలతో అన్నదాన కార్యక్రమాలతో భక్తులు పరవశించిపోతున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బడా భీంగల్ లో గురువారం యువ చైతన్య యూత్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేసి, వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారికి నైవేద్యం సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. అని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు అంకిత్ ఉపాధ్యక్షులు మనోహర్ సహాయకులు గోపి, హరీష్, అనిల్, నవీన్, శ్రీకాంత్, పవన్, గణేష్, తెజేష్, ప్రణీత్,ప్రవీణ్,అచ్యుత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కొడిమ్యాల సెప్టెంబర్ 17.(నవగీతం)** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి



గ్రామానికి చెందిన అంబటి తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా తక్షణ సహాయంగా తిరుపతి కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు.బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, కరీంనగర్ జిల్లా యూత్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, సర్పంచ్ నేరెళ్ల మహేష్ పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు బొడ్డేల్లి భరత్, అంబటి తిరుమలేష్ యాదవ్, తాళ్లపెల్లి అంజయ్య గౌడ్, దిలీప్, జలంధర్, చింటు, అనుమండ్ల అజయ్ రెడ్డి, గోల్కొండ రాజు, కడారి మధు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమారంలో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు





**భీమారం, సెప్టెంబర్ 17 (నవగీతం):** భీమారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి నరేష్ రెడ్డి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలనను కొనసాగిస్తోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని నరేష్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కొనసాగుతున్న ప్రజా పాలన తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెక్కపెల్లి స్వాతి--సంజీవ్, జిల్లా నాయకులు నీరటి మల్లేశం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మడి రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ భూరం అరుణ్, మార్కెట్ కమిటీ సభ్యులు పల్లి భీమయ్య, సురకంటి రాజారెడ్డి, మాజీ సర్పంచులు ఉత్కం శంకర్ గౌడ్, అంగడి ఆనంద్, సీనియర్ నాయకులు చెక్కపెల్లి శంకర్, పెద్దిరెడ్డి స్వామి, బందెల గంగాధర్, ప్యాట నరహరి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో  తెలంగాణ విమోచన దినోత్సవం.



**ములుగు, సెప్టెంబర్ 17,(నవగీతం)** ఏటూరు నాగారం. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ  మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ ఎర్రల్ల ఎల్లయ్య మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్లుగా సుపరిపాలన అందిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఆయన హయాంలో మేక్ ఇన్ ఇండియా, ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్ వంటి ఎన్నో పథకాలతో దేశం అభివృద్ధి చెందిందని, ఆయన నేతృత్వంలో భారతదేశం త్వరలోనే అగ్రరాజ్యంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పలక గంగ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం శ్రీధర్, మండల ఉపాధ్యక్షులు దుర్గం దుర్గారావు, బుల్లె శ్రీను, మండల ప్రధాన కార్యదర్శి కర్నే సంపత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఇర్సవడ్ల జగదీష్, యువ మోర్చా మండల అధ్యక్షులు బోడరాజు, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు పలక శ్రీను, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు ఆత్కూరి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే, సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం మంత్రి సీతక్క.

**ములుగులో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు.**



**ములుగు,సెప్టెంబర్ 17,(నవగీతం)** ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క  జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ద్వారా ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వదిలి ప్రజా ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలన సాగిస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఢేడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ, సుధీర్ రామ్నాథ్ కేకన్ అదనపు కలెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

ఈ కార్యక్రమం ముగింపులో అధికారులు మాట్లాడుతూ ప్రజా పాలన దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

# రచ్చకెక్కిన వైసీపీ పాలిటిక్స్


**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుడు చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీలో తీవ్ర కలకలం రేపాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ సొంత పార్టీ నాయకులపై సంచలన వ్యాఖ్యలు చేయడం శ్రీకాకుళం జిల్లా వైసీపీ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. తమ్మినేని సీతారాం రాజకీయ జీవితానికి ముగింపు ఉండదని, కేవలం విరామాలు మాత్రమే ఉంటాయని వ్యాఖ్యానించిన ఆయన, జిల్లా పార్టీ అధ్యక్షుడి పనితీరుపై నిప్పులు చెరిగారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ తమ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. తమ్మినేని సీతారాంకు, టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మధ్య రహస్య రాజకీయ ఒప్పందం ఉందంటూ వైసీపీ నేతలే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ధర్మాన సోదరులు, కుంభ రవిబాబు, భూడి ముత్యాల నాయుడు వంటి ముఖ్య నేతలు స్పందించకపోవడం దారుణమన్నారు. సీతారాం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఏనాడూ వివక్ష చూపలేదని, కానీ ఇప్పుడు జిల్లాలో ఒకే కులం ప్రాబల్యాన్ని పెంచేలా పార్టీ సాగుతోందనే చర్చ జరుగుతోందన్నారు. ఆమదాలవలస ఇన్ఛార్జ్ చింతాడ రవి అభ్యర్థిత్వంపై నాయకుల్లో అభద్రత ఉందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాదని, కావాలంటే పార్టీ సర్వే నివేదికలను పరిశీలించుకోవచ్చని సైతం సంచలన వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో పార్టీ సీనియర్ నాయకుల తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ వైఖరితో పార్టీకి ఏ ప్రయోజనం లేదన్నారు. ఆమదాలవలసలోని తమ నివాసంలో మీడియాతో మాట్లాడిన చిరంజీవి నాగ్.. శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్ వైఖరి సరిగ్గా లేదని



విమర్శించారు. పార్టీకి పెద్దదిక్కుగా చెప్పుకొనే ధర్మాన ప్రసాదరావు తీవ్ర అభద్రతాభావంతో రాజకీయాలు చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా పరిశీలకుడు బూడి ముత్యాలనాయుడి బాధ్యతలపై ప్రశ్నిస్తూ, స్థానిక ఎన్నికల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను వేదికపై ఉన్న సీనియర్ నాయకులు ఎవరూ ఖండించకపోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. సెప్టెంబర్ 12న త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించింది. చింతాడ రవి అరెస్టును రాజకీయ పరిణామంగా అభివర్ణించి, తమ్మినేని సీతారాం అరెస్టు కాకపోవడానికి బంధుత్వాలే కారణమని గొర్లె కిరణ్ మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. జిల్లా పరిశీలకుడు బూడి ముత్యాలనాయుడు, పార్లమెంట్ పార్టీ పరిశీలకులు అయిన కుంబ రవి, సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావులు గొర్లె కిరణ్ కుమార్ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించడంలో ధర్మాన కృష్ణదాస్ విఫలమయ్యారని, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలను అడ్డుకోలేకపోయారని విమర్శించారు. కేవలం ఒక కులాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయాలు చేయాలనుకుంటే ఆ విషయాన్ని నేరుగా పార్టీ అధిష్ఠానానికి స్పష్టం చేయాలని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాల్లో వైసీపీ ఒక్క సీటూ గెలవదని తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి.

# మీనాక్షి స్థానంలో ముకుల్ వాస్నిక్

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మార్పు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా చర్చనీయాంశమవుతోంది. ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్న ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ స్టడీ టూర్ నిమిత్తం లండన్ వెళ్లనుండటం, రాబోయే దాదాపు పది నెలల పాటు అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేయడం ఏఐసీసీ కి అత్యవసరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం నడుపుతున్నప్పటికీ.. నిత్యం ఉద్భవిస్తున్న అంతర్గత విభేదాలు, వర్గపోరు, మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నూతన ఇన్‌ఛార్జ్ ఎంపికపై హైకమాండ్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. మీనాక్షి నటరాజన్ స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ దళిత నేత ముకుల్ వాస్నిక్ పేరు చాలా ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన ముకుల్ వాస్నిక్ రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మాజీ మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఎన్ఎస్‌యూఐ , యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో పాటు.. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి అనేక సంక్లిష్ట రాష్ట్రాల్లో పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఎలాంటి వివాదాలు లేకుండా పని చేసిన ట్రాక్ రికార్డు ఆయనకుంది. తెలంగాణ వంటి రాజకీయంగా అత్యంత సున్నితమైన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం ఒక ట్రబుల్ షూటర్ అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని వర్గానికి, అలాగే పార్టీలోని పాత కాంగ్రెస్ సీనియర్ నాయకులకు మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరును సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయడం కొత్త ఇన్‌ఛార్జ్‌కు మొదటి సవాలు. ముకుల్ వాస్నిక్‌కు తెలంగాణలోని దాదాపు అందరు సీనియర్ నాయకులతో మంచి వ్యక్తిగత సంబంధాలు ఉన్నందున, ఆయన సమన్వయకర్తగా ఉంటే ఇరు వర్గాలను సమానంగా కలుపుకొని పోగలరనే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. మరొక ప్రధానమైన అంశం.. పార్టీ



మరియు ప్రభుత్వం మధ్య సరైన కమ్యూనికేషన్ లేకపోవడం. నామినేటెడ్ పదవుల భర్తీ, కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు, మరియు జిల్లా స్థాయిలో కేడర్‌కు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి పాత నాయకుల్లో బలంగా ఉంది. వివాదరహిత ఇమేజ్ కలిగిన వాస్నిక్ వంటి సీనియర్ నేత బాధ్యతలు చేపడితే, ప్రభుత్వ నిర్ణయాల్లో పార్టీ ప్రాధాన్యతలను సమతుల్యం చేస్తూ సంక్షోభాలను సునాయాసంగా నివారించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, బిసి-దళిత అజెండాతో ముందుకు సాగుతున్న తరుణంలో.. జాతీయ స్థాయిలో సీనియర్ దళిత ముఖమైన ముకుల్ వాస్నిక్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా సామాజికంగా కూడా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారనుంది. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయం అందించాలంటే పక్కా రోడ్‌మ్యాప్, సీట్ల సర్దుబాటులో పారదర్శకత అవసరం. దీనికి వాస్నిక్ అనుభవం ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేందుకు ఏఐసీసీ సిద్ధమవుతోంది. ముకుల్ వాస్నిక్ ఎంట్రీ ఖాయమైతే, రేవంత్ రెడ్డి నాయకత్వానికి, సీనియర్ల అసంతృప్తులకు మధ్య బలమైన వంతెనగా మారి పార్టీని స్థానిక పోరు వైపు విజయవంతంగా నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

# తిరగబడ్డ గులాబీ వ్యూహం

**హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు జరిపిన నిరసన, ఆ తదనంతరం జరిగిన ఘర్షణల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. చట్టసభల ప్రాంగణంలో ఆందోళనను తీవ్రంగా పరిగణించి, ప్రతిపక్షంపై రాజకీయ మైలేజ్ సాధించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగింది. బీఆర్ఎస్ అగ్రనేతలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయడం, చివరికి మాజీ మంత్రి కేటీఆర్ పిఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేష్‌లను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణ పేరుతో గంటల తరబడి హాజరుపరచడం వరకు వ్యవహారాన్ని తీసుకెళ్లారు. అయితే, ఈ పరిణామాలను విశ్లేషిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి రాజకీయ ప్రయోజనాన్ని ఆశించిందో, అంతకంటే ఎక్కువ రాజకీయ ప్రతికూలతలను ఎదుర్కొనే ప్రమాదంలో పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులపై నమోదు చేసిన తీవ్రమైన కేసులు, అలాగే విచారణ ప్రక్రియ శృతిమించడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ నేతలను చట్టబద్ధంగా కట్టడి చేయాలనే ఉద్దేశం వ్యూహాత్మకమే అయినప్పటికీ, కక్షసాధింపు చర్యల స్థాయికి వ్యవహారాన్ని తీసుకెళ్లారనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో




కేటీఆర్ సిబ్బందిని విచారిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ప్రవేశించి గొడవ పడటానికి యత్నించారనే వార్తలు కలకలం రేపాయి. పోలీస్ స్టేషన్ లోపలే కస్టడీలో ఉన్నవారిపై దాడికి ప్రయత్నించడం విచారకరం, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి అని కేటీఆర్ విమర్శించడంతో బీఆర్ఎస్ దీన్ని బలమైన పొలిటికల్ డిఫెన్స్ అస్త్రంగా మార్చుకోగలిగింది. విచారణాధికారులు , శాంతిభద్రతల యంత్రాంగం వైఫల్యం అని బీఆర్ఎస్ ప్రతిదాడి చేస్తోంటే, పోలీసు శాఖ మాత్రం దాడి ఆరోపణలను ఖండించి సీసీటీవీ ఆధారాలను తెరపైకి తెచ్చింది. అయినప్పటికీ, ప్రభుత్వం తమను వేధిస్తోందని చూపించే అవకాశం బీఆర్ఎస్‌కు దొరికింది. కేవలం ఒక నిరసన ఘర్షణను రాజకీయంగా వినాశకరమైన నేరం గా చిత్రీకరించబోయి, బీఆర్ఎస్ స్థానిక శ్రేణులకు సరికొత్త కసిని, సానుభూతిని కాంగ్రెస్ నాయకత్వమే అందించినట్లయింది. ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టాలనుకున్న ప్రభుత్వం, తానే సెల్ఫ్ గోల్ వేసుకుని ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది. రాజకీయాల్లో అతిగా స్పందించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో సిట్ విచారణలు, సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ వంటి విజువల్స్ ద్వారా మీడియాలో మైలేజ్ సాధించవచ్చని భావించినా, అది కాస్తా వికటించి ప్రజాప్రతినిధుల సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారనే అభిప్రాయానికి దారితీసింది. శాంతిభద్రతల నిర్వహణలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలకు మైలేజ్ ఇచ్చేలా ప్రవర్తించడం వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఘటనను ఆసరాగా చేసుకుని ప్రతిపక్షం నోళ్లు మూయించాలనే కాంగ్రెస్ ప్రయత్నం, బీఆర్ఎస్‌కు తమ క్యాడర్‌ను తిరిగి సమీకరించుకోవడానికి ఒక మంచి అవకాశాన్ని ఇచ్చింది. ఈ ఓవర్ యాక్షన్ మూలంగా రాజకీయ లాభం కంటే కాంగ్రెస్ పార్టీ నష్టపోయే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తోంది. తక్షణమే ఈ వ్యవహారాన్ని సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయకపోతే, రాబోయే రోజుల్లో ప్రతిపక్షాల సానుభూతి వేవ్‌కు కాంగ్రెస్ సమాధానం చెప్పుకోవాల్సి ఉంది.

## 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎంపీడీవో ఇ.స్వరూప



**కొడిమ్యాల సెప్టెంబర్ 17.(నవగీతం)** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయ ఆవరణలో 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ' వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఇ. స్వరూప జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం సిబ్బంది, అధికారులు అందరూ కలిసి జాతీయ గీతాన్ని ఆలపించి వందనం సమర్పించారు.?ఈ సందర్భంగా ఎంపీడీవో ఇ. స్వరూప మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగడమే ప్రజాపాలన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోగూరి నాగభూషణ్ రెడ్డి. మిషన్ భగీరథ ఏఈ వినయ్ రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ ప్రధాన సిబ్బంది, ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) అధికారులు, ఉద్యోగులు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకేపీ) సిబ్బంది. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐదు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ కి దొరికిన కీసర సీఐ, ఎస్సై

**మేడ్చల్** బుధవారం రాత్రి కీసర చెరువు దగ్గర ఛేజింగ్ జరిగింది. ఎస్సై పరుగులు తీస్తుండగా ఏసీబీ టీం వెంటపడింది. సినీమా ఫక్కిలో సీన్ జరిగింది. ఎమైయిందో అంటు స్థానికులు ఆశ్చర్యపోయారు కీసర ఎస్ఐ, సీఐ . ఐదు లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. రేషన్ బియ్యం కేసులో బెయిల్ కోసం నిందితుల నుండి 10 లక్షలు కీసర సీఐ అంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. కీసర చెరువు వద్ద కారులో 5 లక్షలు లంచం తీసుకుంటుండగా వచ్చిన ఏసీబీ అధికారులను చూసి ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి పరుగులు తీసాడు. ఏసీబీ ఛేజింగ్ చేసి పట్టుకుంది. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి, సీఐ అంజనేయులు ముప్పు తిప్పలు పెట్టారు. రేషన్ బియ్యం కేసులో నిందితుల నుండి గత కొంతకాలంగా లంచం డిమాండ్ చేసి నిందితులతో ఇన్స్పెక్టర్ అంజనేయులు పని చేయించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా బిర్యానీలు, కూల్డ్రింక్స్ తీసుకురావాలని సీఐ వేధింపులకు గురిచేయడంతో బాధితులు వేధింపులు తట్టుకోలేక ఏసీబీకి సమాచారం ఇచ్చాడు. చిరవకు సర చెరువు వద్ద నిమజ్జనం డ్యూటీలో వున్న ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి లంచం తీసుకుంటుండగా ఏసీబీ పట్టుకుంది.

## 11 రూపాయిల ఐవీసెట్ 235

**ముంబై :** రూ. 11 విలువైన ఐవీ సెట్‌ను రూ. 325కి విక్రయిస్తూ దాదాపు 2,800 శాతానికి పైగా లాభం దండుకోవడం.. రూ. 6.75ల సిరంజిలను రూ. 57.20కి విక్రయిస్తూ 747 శాతం మార్జిన్ వేయడం.. రూ. 40 విలువైన నెబ్యులైజర్ మాస్క్‌ను ఏకంగా రూ. 715కి విక్రయించడం.. ఇవన్నీ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలోని 'ప్రైస్ మోనిటరింగ్ రీసోర్స్ యూనిట్' (నిర్వహించిన మార్కెట్ సర్వేలో వెలుగుచూసినగ్భ్రాంతికర విషయాలు. ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి వైద్య పరికరాలు, కన్స్యూమబుల్స్ పేరిట ఏ స్థాయిలో లాభార్జన జరుగుతుందో ఈ నివేదిక స్పష్టం చేసింది.: హర్యానాకు చెందిన మెడిప్లస్ సంస్థ తయారు చేసిన 'మెడిఫ్యూజన్ ఐవీ సెట్' కొనుగోలు ధర రూ. 11.05 కాగా, దానికి ఓఖీఖ రూ. 325గా ముద్రించి ఏకంగా 2,841 శాతం మార్జిన్ దండుకుంటున్నారు లైఫ్‌లాంగ్ మెడిటెక్ సంస్థ తయారు చేసిన 10 ఎశ్రీ సిరంజీ కొనుగోలు ధర రూ. 6.75 కాగా, దాన్ని రోగులకు రూ. 57.20కి విక్రయిస్తున్నారు. కెన్యులా, మాస్క్‌లు: రూ. 22.50 విలువైన ఐవీ కెన్యులాను రూ. 424కి, అలాగే రూ. 45 విలువైన నెబ్యులైజర్ మాస్క్ కిట్‌ను రూ. 652కి విక్రయిస్తున్నారు. ఇతర పరికరాలు: విన్‌జో హెల్త్‌కేర్, రోమ్సన్, రిబ్బెల్ వంటి సంస్థలు తయారు చేసే కథెటర్లు, నీడిల్స్ కొనుగోలు ధర కంటే 10 నుంచి 19 రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడుపోతున్నాయి. ఈ అడ్డగోలు దోపిడీని మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారామ్ ముండే తీవ్రంగా ఖండించారు. తయారీదారులు తమ ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్ ఖర్చులు, లాభాలను కలిపిన తర్వాతే ప్రాథమిక కొనుగోలు ధర నిర్ణయమవుతుందని, దానిపై మళ్ల ఇన్ని రెట్లు ధరలు పెంచడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆసుపత్రి అత్యవసర చికిత్సలో ఉండే రోగులకు ఈ పరికరాల ధరలపై బేరమాడే అవకాశం ఉండదని, అందుకే డ్రగ్స్ ఆర్డర్ (ఆఖఅూ) 2013 పరిధిలోకి ఈ మెడికల్ పరికరాలను తీసుకొచ్చి ధరలపై పరిమితి విధించాలని కోరుతూ కేంద్ర విలేఖర రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ శాఖ కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. విధానపరమైన చర్యలు తీసుకోవడం ద్వారానే ప్రజలపై పడుతున్న ఈ తీవ్రమైన ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చని స్పష్టం చేశారు.

## పీచే మూడ్ లో రెబల్ గులాబీలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం హాట్ టాపిక్ గా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ అంశంపై బీఆర్ఎస్ అధిష్టానానికి సొంత కేడర్ నుంచే తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతోంది. గతంలో పార్టీ మారిన కొందరు ఎమ్మెల్యేలు తిరిగి గులాబీ గూటికి చేరుకునేందుకు ప్రయత్నిస్తుండగా, క్షేత్రస్థాయిలో ఉండే స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాత్రం వారి రాకను బలంగా అడ్డుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తమను వదిలి వెళ్లిన నాయకులకు మళ్లీ రెడ్ కార్పెట్ వేయడంపై కేడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీలో చేరిన కొందరు ఎమ్మెల్యేలకు అక్కడ పరిస్థితులు సరిపడకపోవడంతో, వారు మళ్లీ బీఆర్ఎస్ అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇందులో భాగంగానే పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జూలై 2024లో కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. అంతేకాకుండా కేసీఆర్‌ను తాను మోసం చేయలేనని, తనకు అన్నం పెట్టిన వ్యక్తిని మరిచిపోలేనని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సైతం కేసీఆర్‌కు మద్దతుగా మాట్లాడటం, గత నెల జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కన్నీటి పర్యంతం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలపై పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాలోచనలు జరుపుతున్నారు. పార్టీలోకి తిరిగి వస్తామంటున్న నేతలపై ఆయా నియోజకవర్గాల్లోని స్థానిక శ్రేణుల అభిప్రాయాలు తీసుకోవాలని అధిష్టానం భావించింది. ఇందులో భాగంగా పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన కార్యకర్తలు, స్థానిక నాయకులతో ప్రత్యేకంగా చర్చిస్తున్నారు. అయితే ఫిరాయింపుదారులను పార్టీలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకోవద్దని మెజారిటీ స్థానిక నాయకులు తెగేసి చెబుతున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న క్యాడర్‌ను కాదని, అవకాశవాద రాజకీయాలు చేసిన వారికి మళ్లీ ప్రాధాన్యత ఇస్తే సంస్థాగతంగా తీవ్ర నష్టం జరుగుతుందని స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి బదులుగా, నియోజకవర్గాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, కొత్త వాళ్లను తయారు చేయాలని వారు అధిష్టానానికి గట్టిగా సూచిస్తున్నారు. ఒకవైపు నేతల రాకకోసం కొందరు ప్రయత్నిస్తుంటే, మరోవైపు క్షేత్రస్థాయి నేతల వ్యతిరేకత కారణంగా బీఆర్ఎస్ అధిష్టానం ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 18
సెప్టెంబర్ 2026

## బిజినెస్

### బ్యాంకుల నుంచి రూ. 2.40 లక్షల కోట్లు వెనక్కితీసుకున్న ఆర్బీఐ



బ్యాంకింగ్ వ్యవస్థలో భారీగా ఉన్న అదనపు ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) ఉపసంహరించుకునే చర్యల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గురువారం రూ.2.40 లక్షల కోట్లను సమీకరించింది. వేరియబుల్ రేట్ రివర్స్ రెపో (వీఆర్ఆర్ఆర్) వేలం ద్వారా బ్యాంకుల నుంచి ఈ నిధులను కేంద్ర బ్యాంక్ తీసుకుంది. వీఆర్ఆర్ఆర్ వేలంలో మొత్తం రూ.2,39,959 కోట్ల విలువైన బిడ్లు వచ్చాయి. వీటన్నింటినీ 5.24 శాతం కటాఫ్ రేటుతో, అదే వెయిటెడ్ యావరేజ్ రేటుతో ఆర్బీఐ పూర్తిగా ఆమోదించింది. బ్యాంకింగ్ వ్యవస్థలో అదనంగా ఉన్న నిధులను తాత్కాలికంగా ఉపసంహరించుకోవడంతో పాటు, ఓవర్‌నైట్ మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడం వీఆర్ఆర్ఆర్ వేలం ప్రధాన ఉద్దేశం. బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ సెప్టెంబర్ 16 నాటికి సుమారు రూ.7.38 లక్షల కోట్ల మిగులులో ఉన్నట్లు అంచనా. దీంతో ఈ అదనపు నిధులను దశలవారీగా వ్యవస్థ నుంచి వెనక్కి తీసుకునే చర్యలను ఆర్బీఐ కొనసాగిస్తోంది. గత నెల నుంచి కేంద్ర బ్యాంక్ పలు విడతల్లో వీఆర్ఆర్ఆర్ వేలాలను నిర్వహిస్తోంది.

మరో రూ.1 లక్ష కోట్ల ఉపసంహరణ

వీఆర్ఆర్ఆర్ చర్యలకు అదనంగా ప్రభుత్వ సెక్యూరిటీల ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ (ఓఎంఓ) విక్రయాల ద్వారా కూడా వ్యవస్థలోని లిక్విడిటీని తగ్గించేందుకు ఆర్బీఐ చర్యలు చేపట్టింది. మొత్తం రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను మూడు విడతల్లో విక్రయించనున్నట్లు గత వారం ప్రకటించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 17న రూ.50,000 కోట్లు, సెప్టెంబర్ 21, 28 తేదీల్లో చెరో రూ.25,000 కోట్ల విలువైన సెక్యూరిటీల విక్రయాన్ని చేపట్టనుంది.

ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్ల ప్రభావం

ఇటీవలి కాలంలో బ్యాంకులు ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్ఆర్-బీ) డిపాజిట్లను పెద్ద ఎత్తున సమీకరించడం కూడా బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ పెరగడానికి ఒక కారణంగా మారింది. విదేశీ కరెన్సీ దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చిన తర్వాత, ఆర్బీఐతో చేపట్టిన తదుపరి మారక లావాదేవీల ద్వారా బ్యాంకులకు రూపాయి నిధులు అందుబాటులోకి వచ్చాయి. దీనికి తోడు నెలాఖరు ప్రభుత్వ వ్యయం కూడా వ్యవస్థలో నగదు లభ్యతను పెంచుతోంది. ముఖ్యంగా ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపులు వంటి ప్రభుత్వ వ్యయాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి నిధులు చేరుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అదనపు లిక్విడిటీని క్రమబద్ధీకరించేందుకు ఆర్బీఐ వీఆర్ఆర్ఆర్, ఓఎంఓ వంటి సాధనాలను ఉపయోగిస్తోంది.

# మాపై ఛార్జీల భారం వద్దు

## ప్రభుత్వాన్ని మినహాయింపు కోరుతున్న పెట్రో డీలర్స్..!

తమకు ఛార్జీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని పెట్రో డీలర్లు కోరుతున్నారు. పెట్రోల్ బంకుల్లో ఇంధనం అమ్మకాలపై యూపీఐ ద్వారా చేసే చెల్లింపులకు వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై 'ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు. కొత్త యూపీఐ నిబంధనల ప్రకారం.. పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో రూ.2,000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ ఛార్జీ విధిస్తున్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో జరిగే మొత్తం కొనుగోళ్లలో సుమారు 30 నుంచి 40 శాతం లావాదేవీలు ఈ పరిధిలోకి వస్తాయని డీలర్లు చెబుతున్నారు. పెట్రోల్ అమ్మకాలు నిర్దేశిత కమీషన్లపై ఆధారపడి జరుగుతాయని, ఈ అదనపు ఎండీఆర్ ఛార్జీల భారం తమ మార్జిన్లను దెబ్బతీస్తుందని డీలర్ల సంఘం ఆందోళన వ్యక్తంచేసింది. ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ అధికారులు ఎండీఆర్ విధింపు వెనుక ఉన్న కారణాలను వివరించారు. దేశంలో యూపీఐ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు ఈ ఛార్జీలు అవసరమని వారు తెలిపారు. మరోవైపు దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంలో తాము ముందు వరుసలో ఉన్నామని, ప్రభుత్వంతో కలిసి పనిచేశామని ఏఐపీడీఏ గుర్తుచేసింది. ఎండీఆర్ అనేది ప్రభుత్వంగానీ, ఎన్‌పీసీఐగానీ వసూలు చేసే పన్ను కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టంచేసింది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు ఈ మొత్తాన్ని బ్యాంకులకు, పేమెంట్ అప్లికేషన్ ప్రొవైడర్లకు పంచుతారని తెలిపింది. ఇంధనం, రైల్వేలు, టెలికామ్, బీమా, వ్యవసాయం వంటి తక్కువ మార్జిన్లు ఉండే కీలక రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఈ రూ.5 ఫ్లాట్ ఛార్జీని వర్తింపజేస్తున్నారు. ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని, వినియోగదారులు, డీలర్లు, యూపీఐ భాగస్వాములు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని ఏఐపీడీఏ ఒక ప్రకటనలో పేర్కొన్నది.



## టాటా గ్రూప్ చైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్..

# మూడోసారి నియమించిన టాటా సన్స్

టాటా గ్రూప్ చైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ మరోసారి నియమితులయ్యారు. టాటా సన్స్ గ్రూప్ ఆయనను చైర్మన్‌గా మూడోసారి నియమించింది. ఐదేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. గురువారం ముంబైలో జరిగిన బోర్డు మీటింగ్‌లో చంద్రశేఖరన్ నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. వరుసగా రెండుసార్లు టాటా గ్రూప్ చైర్మన్‌గా ఎన్నికైన చంద్రశేఖరన్ గత ఆగష్టు 12న ఈ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. తన పదవీ కాలం ముగిసిన తర్వాత మళ్లీ బాధ్యతల్లో కొనసాగలేనని స్పష్టం చేశారు. అయితే, చంద్రశేఖరన్‌నే మళ్లీ నియమించడానికి బలమైన కారణ ఉంది. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సంబంధించి మినహాయింపు కోరుతూ టాటా గ్రూప్ ఇటీవల ఆర్బీఐకి దరఖాస్తు చేసుకుంది. కానీ, ఈ దరఖాస్తును ఆర్బీఐ తిరస్కరించింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కావడం అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో చైర్మన్‌గా నాయకత్వ మార్పు మంచిది కాదనే ఉద్దేశంతో తిరిగి చంద్రశేఖరన్‌నే నియమించాలని బోర్డు భావించింది. టాటా గ్రూప్‌లో అత్యధిక వాటా కలిగిన టాటా సన్స్‌కు ఈ నియామకం చాలా కీలకం. ఆయన నియామకంతో స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు సంబంధించిన ప్రక్రియ సజావుగా సాగుతుందని కంపెనీ వర్గాలు భావిస్తున్నాయి. 2017 నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. మరో ఐదేళ్లపాటు చైర్మన్‌గా ఉంటారు. 2017లో తొలిసారి చైర్మన్ కాగా, 2022లో మరోసారి నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం ఫిబ్రవరి 2027 వరకు ఉంది.




చంద్రేశఖరన్ నాయకత్వంలో టాటా గ్రూప్ అనేక వ్యాపారాలకు విస్తరించింది. ముఖ్యంగా టెక్నాలజీ, డిజిటల్ రంగాల్లో దూసుకెళ్తోంది. చంద్రశేఖరన్‌ను చైర్మన్‌గా నియమించినప్పటికీ.. ఈ విషయంలో ఆయన నిర్ణయం కీలకం కానుంది. ఆయనను పదవిలో కొనసాగాల్సిందిగా ది నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ విజ్ఞప్తి చేస్తుంది. అనంతరం ఆయన అంగీకరిస్తే మరోసారి చైర్మన్‌గా కొనసాగుతారు.

# మూడో టీ20లో టీమిండియా విజయం




స్వదేశంలో అఫ్గానిస్తాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను టీమిండియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఢిల్లీ వేదికగా గురువారం జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 127 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై విజయం సాధించింది. 222 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ భారత బౌలర్ల ధాటికి 14.1 ఓవర్లలో 94 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ ఇబ్రహీం జద్రన్ (25) మినహా మిగతావాళ్లు బ్యాటింగ్‌లో దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి, రవి బిష్ణోయి చెరో 3 వికెట్లు తీయగా, అక్షర్ పటేల్ 2 వికెట్లు, యశ్ ఠాకూర్, బుమ్రాలు తలా ఒక వికెట్ పడగొట్టారు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (34 బంతుల్లో 108; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) శతకంతో విధ్వంసం సృష్టించగా.. సంజూ శాంసన్ (35 బంతుల్లో 50) అర్థసెంచరీ సాధించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (29) రాణించాడు. అఫ్గానిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్‌జయ్ 2 వికెట్లు తీయగా.. రషీద్ ఖాన్, అబ్దుల్లా అహ్మద్‌జయ్ చెరొక వికెట్ తీశారు. అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ టీమిండియానే విజయం సాధించి ఆఫ్గన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. శతకంతో చెలరేగిన ఓపెనర్ అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

### 'వచ్చామా.. కసితీరా కొట్టామా.. వెళ్లామా; ఇదే నా స్టైల్'

అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ 30 బంతుల్లోనే సెంచరీ సాధించి పలు రికార్డులు బద్దలుకొట్టాడు. భారత్ తరపున అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డును అభిషేక్ తన పేరిట లిఖించుకున్నాడు. ఇప్పటివరకు ఆ రికార్డు రోహిత్ శర్మ (35 బంతులు) పేరిట ఉండేది. ఇక మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను టీమిండియా 3-0తో ఆఫ్గన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.

ఇక మూడో టీ20 మ్యాచ్‌లో టీమిండియా 127 పరుగుల భారీ తేడాతో అఫ్గానిస్తాన్‌ను మట్టికరిపించింది. మ్యాచ్ విజయం అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్న అభిషేక్ శర్మ తన ప్రదర్శనపై స్పందించాడు. రికార్డులు తనకు ముఖ్యం కాదని, మ్యాచ్‌లో బరిలోకి దిగితే వచ్చామా.. కసితీరా కొట్టామా.. వెళ్లామా అన్నట్లుగా తన బ్యాటింగ్ స్టైల్ ఉంటుందని అభిషేక్ తెలిపాడు. "ముందుగా ఇవాళ మ్యాచ్ చూసేందుకు వచ్చిన ప్రేక్షకుల్లో ఎవరిదైనా పుట్టినరోజు ఉంటే వారికి నా ప్రత్యేక శుభాకాంక్షలు. నేను సాధించిన సెంచరీ వారికి గిఫ్ట్ అని భావిస్తున్నా. ఇక రెండు సంవత్సరాల క్రితం, మేము ఒక నిర్దిష్ట ప్రణాళికతో ఆడి అన్ని జట్లపై ఆధిపత్యం చెలాయించాలని నిర్ణయించుకున్న విషయం నాకు బాగా గుర్తుంది. ఆ ప్రణాళిక ఒక సంవత్సరం పాటు చక్కగానే పనిచేసింది. ఈలోగా రెండు (ఇంగ్లండ్, ఐర్లాండ్) సిరీస్‌లు మాకు ప్రతికూల ఫలితాలను ఇచ్చాయి. కానీ ఒకటి రెండు చెడ్డ సిరీస్‌లు మా బ్యాటింగ్‌ను నిర్వచించలేవు. ఆడుతుంది చిన్న జట్టుతోనే, పెద్ద జట్టుతోనా అనేది పక్కనబెట్టి జట్టు విజయం కోసం మేమంతా సమిష్టి ప్రదర్శన చేశాము. ఇక నా విషయానికొస్తే ప్రతీ సిరీస్‌కు ముందు నేను అనుసరించే ప్రక్రియపైనే ఇదంతా ఆధారపడి ఉంటుందని భావిస్తున్నా. ఎవరితో ఆడుతున్నాను, బౌలర్లు ఎవరు అనే విషయాలు నాకు ప్రత్యేకం. కాబట్టి వ్యక్తిగతంగా ఒక బ్యాటర్‌గా నా దృష్టి ఎప్పుడూ బ్యాటింగ్ పవర్ ప్లేపైనే ఉంటుంది. మైదానంలో దూకుడుగా ఆడాలంటే ముందుగా సరైన ప్రిపరేషన్ అవసరం. అదే నా విజయానికి కారణం. ఆఫ్గన్‌తో టీ20 సిరీస్‌లో బ్యాటింగ్‌కు సంబంధించి పెద్దగా ప్రణాళికలంటూ ఏమీ లేవు. ఆది నుంచి వారిపై ఆధిపత్యం ప్రదర్శిస్తే జట్టుకు భారీ స్కోరు ఇవ్వగలననే అంశాన్ని మాత్రమే మైండ్‌లో పెట్టుకొని ఆడుతూ వచ్చాను. రికార్డుల గురించి పెద్దగా పట్టించుకోను. జట్టుకు అవసరమైనప్పుడు బాధ్యతాయుతంగా ఆడి పని పూర్తి చేయడంపైనే దృష్టి సారిస్తాను. కెప్టెన్, కోచ్ నుంచి మద్దతు ఉండడం వల్లే ఇదంతా సాధ్యమైంది." అని చెప్పుకొచ్చాడు. ఇక అభిషేక్ శర్మ అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌లు ఆడి 269 స్ట్రైక్‌రేట్‌తో 229 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ, అర్థసెంచరీ ఉన్నాయి.




## స్పోర్ట్స్

### మెస్సీ వందో గోల్.. సాకర్ మాంత్రికుడి ఖాతాలో 49వ ట్రోఫీ..!



ఇటీవలే అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికిన లియోనల్ మెస్సీ మరోసారి మెరిశాడు. ఇంటర్ మియామి క్లబ్ తరఫున వందో గోల్ కొట్టాడీ వెంటరన్. బుధవారం జరిగిన కాంపెయోన్స్ కప్ ఫైనల్లో మెస్సీ గోల్‌తో క్రుజ్ అజుల్‌పై 2-0తో ఇంటర్ మియామి జయభేరి మోగించింది. తమ జట్టుకు ట్రోఫీ అందించిన ఈ సాకర్ మాంత్రికుడు వ్యక్తిగతంగా 49వ ట్రోఫీని సాధించాడు. మైదానంలోకి దిగాడంటే గోల్స్‌తో రెచ్చిపోయే లియోనల్ మెస్సీ ఈసారి ఫైనల్లో చెలరేగాడు. క్యాంపెయోన్స్ కప్ టైటిల్ పోరులు క్రుజ్ అజుల్‌పై 24వ నిమిషంలో మెస్సీ సూపర్‌గా గోల్ చేశాడు. లూయిస్ సూరెజ్ అందించిన పాస్‌ను అంతే అద్భుతంగా తలతో బంతిని ప్రత్యర్థి గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఇంటర్ మియామి తరఫున మెస్సీకి ఇది వందో గోల్ కావడం విశేషం. పీఎస్‌జీ(పారిస్ సెయింట్ జర్మనీ) నుంచి 2023లో ఈ క్లబ్‌కు మారిన ఈ సాకర్ దిగ్గజం.. 115వ మ్యాచ్‌లో సెంచరీ గోల్ సాధించాడు. మొత్తంగా అతడు వచ్చాక మియామి నాలుగు ట్రోఫీలు గెలుపొందింది. కెరీర్ పరంగా వరల్డ్‌కప్, క్లబ్స్ తరఫున గెలిచిన టైటిళ్లతో కలిపి 49వ ట్రోఫీతో మెస్సీ ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. తండ్రి మరణంతో కొన్ని రోజులు ఆటకు బ్రేకిచ్చి.. మళ్లీ మైదానంలో అడుగుపెట్టిన ఈ వెటరన్ ప్లేయర్ మునపటిలా గోల్స్‌తో అభిమానులను అలరిస్తున్నాడు.

#### టాప్ వీళ్లే

ప్రస్తుతం కెరీర్‌లో అత్యధిక ట్రోఫీలు సాధించిన వారి జాబితాలో లియోనల్ మెస్సీ అగ్రస్థానంలో ఉండగా.. డానీ అల్వెస్ 43 ట్రోఫీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

1. లియోనల్ మెస్సీ(అర్జెంటీనా) -- 49 ట్రోఫీలు
2. డానీ అల్వెస్(బ్రెజిల్) -- 43 ట్రోఫీలు
3. మార్సెలో(బ్రెజిల్) -- 42 ట్రోఫీలు
4. అంద్రెస్ ఇనియెస్టా(స్పెయిన్)- 40 ట్రోఫీలు

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 18
సెప్టెంబర్ 2026

# సినిమా రిలీజ్ తర్వాత జడల్ అని పిలుస్తారు




'ప్రేక్షకులకు గొప్ప మాస్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా 'ది ప్యారడైజ్'. ఈ సినిమా ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ నెల 24న చూస్తారు. చాలా స్ట్రాంగ్ ఎమోషన్స్‌తో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ సినిమా తీశారు. నా గత చిత్రాలకు తమిళ ప్రేక్షకులు మంచి సపోర్ట్ ఇచ్చారు. నా కెరీర్‌లో ఇంత కష్టపడ్డ సినిమా లేదు. కచ్చితంగా ఈ సినిమా కూడా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఇప్పుడు మీరంతా నన్ను 'నాని' అని పిలుస్తున్నారు. రేపు ఈ సినిమా విడుదలయ్యాక అంతా 'జడల్' అని పిలుస్తారు. సుబ్బుగా చేసిన కయాదు లోహర్, కీర్తి సురేశ్ క్యామియో.. అనిరుధ్ సంగీతం ఈ సినిమాను నెక్స్ట్ లెవల్లో నిలబెట్టాయి' అని అగ్ర కథానాయకుడు నాని అన్నారు. ఆయన హీరోగా రూపొందిన పీరియడ్ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్'. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ప్రత్యేక పాత్ర పోషించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చెరుకూరి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా పానిండియా స్థాయిలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం చెన్నైలో నిర్వహించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడారు. ప్యారడైజ్ ఓ రెవల్యూషనరీ ఫిల్మ్ అని, నాని ఇందులో రెబల్‌గా కనిపిస్తారని, తన ప్రాంతం కోసం, ఉనికి కోసం, ప్రజల కోసం , తల్లి కోసం తను ఎలా పోరాడాడు అనేది ఇందులో ప్రధానాంశమని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల అన్నారు. ఈ సినిమాను తమిళంలో విడుదల చేస్తున్న స్వరూప్ కూడా మాట్లాడారు.



# పవర్‌ఫుల్ పోలీస్ ప్రేమ్‌రాజ్

అగ్ర కథానాయకుడు సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'సీన్'. జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఝగారం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై జ్యోతిక, సూర్య నిర్మిస్తున్నారు. దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో డీఎస్పీ ప్రేమ్‌రాజ్‌గా శక్తివంతమైన పాత్రలో కనిపించారు సూర్య. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కమాండింగ్ బాడీ లాంగ్వేజ్, పంచ్‌లతో కూడిన సంభాషణలతో సూర్య తనదైన మేనరిజమ్స్‌తో ఆకట్టుకున్నారు. నజ్రియా నజీమ్, ఆనంద్‌రాజ్, లాల్, రాజ్‌ప్రియాన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# మహేశ్‌బాబుతో భన్సాలీ సినిమా?

అగ్ర హీరో మహేశ్‌బాబుతో ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారా? అంటే ఔననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సంజయ్‌లీలా భన్సాలీ ఇటీవలే మహేశ్‌బాబుని కలిసి కథ చెప్పారని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. భన్సాలీ శైలి భారీ సెట్లు, గ్రాండ్ విజువల్స్, బలమైన భావోద్వేగాలతో సాగే పీరియాడిక్ కథ ఇదని ప్రచారం జరుగుతున్నది. గతంలో కూడా అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి అగ్ర హీరోలతో సంజయ్‌లీలా భన్సాలీ సినిమా చేయొచ్చనే వార్తలొచ్చాయి. అయితే ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు-భన్సాలీ ప్రాజెక్ట్‌పై జరుగుతున్న ప్రచారం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం మహేశ్‌బాబు 'వారణాసి'పైనే తన దృష్టిని కేంద్రీకరించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇక సంజయ్‌లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' చిత్రం జనవరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ రెండు చిత్రాలు పూర్తయ్యాకే మహేష్‌బాబు-సంజయ్‌లీలా భన్సాలీ సినిమాపై స్పష్టత వస్తుందంటున్నారు.

# వేవేల ఊహలే చూపినా..



టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, విష్ణు తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ చిత్రం 'బా బా బ్లాక్‌షీప్'. గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వేణు దోనెపూడి నిర్మిస్తున్నారు. అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల ఈ సినిమా నుంచి 'వేవేల ఊహలే చూపినా...' పాటను అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఎలక్ట్రానిక్ కిలి, ఆర్మాడో సంగీతాన్నందించిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. మేఘాలయా రాష్ట్రంలోనే మొత్తం చిత్రీకరణ జరిపామని, ఇంట్రెస్టింగ్ క్రైమ్ ఎలిమెంట్ నేపథ్యంలో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు.

# సంక్రాంతికి వచ్చేది కాకానే.. మరి విశ్వంభర పరిస్థితేంటి?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా వస్తోన్న మూవీ కాగా. ఈ సినిమాకు బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సత్యం అనే పాత్రలో చిరు నటిస్తున్నారు. వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ తేదీని అఫీషియల్‌గా ప్రకటించారు మేకర్స్. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగనుంది. అయితే చిరంజీవి నటించిన మరో మూవీ విశ్వంభర. ఈ ఏడాదిలోనే రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం ఇప్పటి వరకు విడుదలకు నోచుకోలేదు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో నిలపాలని మేకర్స్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ముందుగానే డేట్ ప్రకటించిన కాకా వాయిదా పడనుందనే టాక్ వినిపించింది. దీంతో కాకా నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. కాకా విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. వచ్చే సంక్రాంతి కానుకగా జనవరి 13న రిలీజ్ చేస్తామని అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ త్వరలోనే విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. దీంతో కాకా వాయిదా పడుతుందన్న వార్తలకు చెక్‌పడింది. మరి విశ్వంభర రిలీజ్ ఎప్పుడనేది క్లారిటీ రావాల్సి ఉంది. కాగా.. ఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేతా పేతురాజ్, సునీల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.